# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

24.2.2026 మంగళవారం Monday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 220 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







## ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

23 నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం

మే 12న పరీక్ష

.. వివరాలు 2లో



## నా పేరుతో సంస్థల్లేవ్!

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం

.. వివరాలు 2లో



# సర్కారీ మెట్రో!

### ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా స్వాధీనం.. విస్తరణకు తొలగనున్న అడ్డంకులు

- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టీటీడీ నిర్మాణాలకు 20 ఎకరాలు
- గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** హైదరాబాద్ మెట్రో రైలును ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవేశ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. మిగతా 2 లో

## కేజీబీవీ బెడ్స్ టెండర్లలో 100 కోట్ల కుంభకోణం

బీఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్ లోకాయుక్తలో ఫిర్యాదు 3



## కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత



ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత

పరీక్షించిన వైద్యులు.. రెస్ట్ తీసుకోవాలని సూచన 3




## సరోగసి అక్రమాలపై విచారణ

ఈడీ కస్టడీకి డాక్టర్ నమ్రత 2

కోర్టు ఆదేశాలతో విచారణకు సిద్ధం

## వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం 2






# రాహుల్ ప్రధాని అయితేనే..

### దేశంలోని సమస్యలకు పరిష్కారం

- రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు దక్కేలా కృషి
- స్థానాల గెలుపే లక్ష్యంగా డీసీసీ అధ్యక్షులు పనిచేయాలి
- కుల గణనతో సామాజిక న్యాయం..
- కాంగ్రెస్ ముక్త భారత్ కుట్రలను తిప్పికొడదాం
- డీసీసీల శిక్షణాశిబిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**వికారాబాద్, ఫిబ్రవరి 23:** రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న మిగతా 2 లో

## పలు జిల్లాల్లో వడగళ్ల వాన

పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

పంటలకు తీవ్రనష్టం.. ఆందోళనలో రైతులు



బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భాగ్యనగరంలో పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపం చూపినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బుపట్టి చల్లని గాలులు వీచడంతో నగరంలో ఆహ్లాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా రోజుల తర్వాత కురిసిన చిరు జల్లులు భాగ్యనగరాన్ని మురిపించాయి. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్న తరుణంలో హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు పలకరించాడు. 2

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్



### ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

కశ్మీర్‌లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. 4



## మరోమారు పెరిగిన బంగారం ధరలు

అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్

సోమవారం వెండి ధర కిలోకు రూ.15,000 పైగా పెర గగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగ బాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు, వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. 4

## బంగ్లాదేశ్‌లో మరో దారుణం

### హిందూ దివ్యాంగురాలిపై సామూహిక లైంగికదాడి

బంగ్లాదేశ్‌లో తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు.



4




# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

## సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం

## టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# జాతరలో అమానుష ఘటన

## చర్యలు తీసుకోవాలని డిజిపికి ఫిర్యాదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** కుమ్మేరా జాతరలో అమానుష ఘటనపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోకి వెళ్లి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అగ్రకులానికి చెందిన నాయకుడు రజక కులానికి చెందిన రెండు నెలల పసికందును తన్ని చంపిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు వెలికితీయాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, ఉపేందర్ చారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్, నేతలు స్వామి యాదవ్ ,రాజు తదితరులున్నారు.

# కలుషిత ఆహారం పెట్టారంటూ విద్యార్థుల ఆందోళన


**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలల పరిస్థితితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. నాణ్యత లేని, కలుషిత ఆహారం పెడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచుగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలతో వందలాది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారు. ఇటీవలే నాగర్‌కర్నూల్ సంఘటన మరవకముందే జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడురు గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. కలుషిత ఆహారం పెడుతున్నారని ఆరోపిస్తూ తరగతులు బహిష్కరించి రోడ్డెక్కారు. మంచి ఆహారం పెట్టి, కనీస వసతులు కల్పించాలని, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు.

# ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

## 23 నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్టాత్మక టీజీ ఎడ్‌సెట్-2026 నోటిఫికేషన్‌ను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కేయూ, దరఖాస్తుల ప్రక్రియ నుంచి ఫలితాల విడుదల వరకు పూర్తి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 23వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల సౌకర్యార్థం అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. రూ. 250 ఫైన్‌తో ఏప్రిల్ 23 వరకు, రూ. 500 ఫైన్‌తో ఏప్రిల్ 27 వరకు, రూ. 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నారు. ఇక పరీక్షా నిర్వహణ విషయానికి వస్తే, మే 12వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి ఉదయం , సాయంత్రం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయిన మూడు రోజుల్లోనే అంటే మే 15న అధికారులు ప్రాథమిక కీని విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించిన అనంతరం, మే 30వ తేదీన తుది ఫలితాలను వెల్లడించనున్నారు. బీఈడీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

# నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు: కేటీఆర్




**హైదరాబాద్,ఫిబ్రవరి 23:** తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

# మెట్రో ఇక సర్కారు సొంతం

మొదటి పేజీ తరువాయి

ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన ప్రక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన పక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జన గణన పక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. చీఫ్ సెక్రెటరీ ఈ పక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ పక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యూమరేటర్లను, వారికి దిశానిర్దేశం చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, రెండో దశ జనగణన వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, లోపాలు లేకుండా ఈ పక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# రాహుల్ ప్రధాని అయితేనే దేశంలోని సమస్యలకు పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ÷ఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సరోగసి అక్రమాలపై విచారణ

## ఈడీ కస్టడీకి డాక్టర్ నమ్రత

## కోర్టు ఆదేశాలతో విచారణకు సిద్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** సృష్టి సరోగసీ అక్రమాల కేసులో అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో మరింత వేగం పెరిగింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం రెండు రోజుల పాటు ఈడీ కస్టడీలో విచారణ జరగనుంది. ఈ కేసు సరోగసీ పేరుతో అక్రమాలు, హవాలా, మనీలాండరింగ్ ఆరోపణలతో సంబంధం ఉండటంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోర్టును కోరింది. అయితే కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. రెండు రోజుల పాటు మాత్రమే కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఈడీ అధికారులు డాక్టర్ నమ్రతను తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో కేసుకు సంబంధించిన కీలక అంశాలను వెలికితీసే ప్రయత్నం చేయనున్నారు. డాక్టర్ నమ్రతపై సరోగసీ సేవల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా, అక్రమంగా సరోగసీ వ్యవస్థను ఉపయోగించి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో ముఖ్యంగా హవాలా, మనీలాండరింగ్ అంశాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. డాక్టర్ నమ్రత భారీ మొత్తంలో డబ్బు సేకరించి, హవాలా మార్గం ద్వారా విదేశాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డబ్బు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై ఈడీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టనున్నారు. ఈడీ కస్టడీ విచారణలో.. అక్రమంగా సేకరించిన డబ్బు తరలింపు మార్గాలు, ఇందులో పాల్గొన్న ఇతర వ్యక్తులు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై కీలక సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కేసులో మరికొందరు వ్యక్తులు కూడా ఉన్నారా అన్న దానిపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సరోగసీ వ్యవస్థను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. ఈ కేసు ద్వారా అక్రమంగా జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూళ్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయ మయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737



# కామారెడ్డిలో తగ్గని ఉద్రిక్తత

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత
- పరీక్షించిన వైద్యులు.. రెస్ట్ తీసుకోవాలని సూచన



**కామారెడ్డి, ఫిబ్రవరి 23:** ఓవైపు కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతున్న వేళ,కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్భంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అయితే మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు. ఇదిలావుంటే కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య సవాళ్ల నేపథ్యంలో స్థానికంగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. సోమవారం జిల్లా కలెక్టర్‌తో బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భేటీ కావాలనున్నారు. తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో అందుకు సంబంధించిన సాక్ష్యాలు తీసుకురావాలంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మరోవైపు డిగ్రీ కాలేజీ భూముల విషయంలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వెంకట రమణారెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రాజీనామాకు సిద్ధం కావాలంటూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములపై స్పష్టత ఇవ్వాలంటూ అధికారులను బీజేపీ డిమాండ్ చేసింది. ఇలా ఇరు పార్టీనేతల విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేపథ్యంలో పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ఇరు పార్టీల నేతలను కలెక్టర్ కార్యాలయానికి పోలీసులు వెళ్లనిస్తారా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా కామారెడ్డి వెళ్లేందుకు యత్నించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కామారెడ్డి వెళ్తుండగా.. ఆయన్నూ పెద్దశంకర్‌పేట వద్ద అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే.

# గౌరవెల్లి ప్రాజెక్టు అడ్డంకులు తొలగిస్తాం

- లీగల్ చిక్కుల వల్లే జాప్యం.. బుధవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. నిధుల విడుదలకు హామీ..
- మూడు జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో సమీక్ష



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** తెలంగాణలోని కీలకమైన గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన ఈ ప్రాజెక్టుపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆలస్యానికి గల కారణాలు, ముఖ్యంగా న్యాయపరమైన ఇబ్బందులపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగవంతం కావాలంటే భూసేకరణ ప్రక్రియ పూర్తి కావాలని, దానికి అడ్డుగా ఉన్న లీగల్ సమస్యలను క్లియర్ చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. "ఈ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం సుప్రీంకోర్టులో ఎన్విరాన్‌మెంట్ కేసు విచారణ ఉంది. సర్వోన్నత న్యాయస్థానంలో మాకు అనుకూలంగా తీర్పు వస్తుందనే పూర్తి విశ్వాసం ఉంది" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రాజెక్టు కోసం నిరంతరం ఒత్తిడి తెస్తున్నారని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా భూసేకరణకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ (ఏజీ), ఇరిగేషన్ అధికారులతో జరిగిన ఈ సమావేశంలో కాలువల భూసేకరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి చేరేలా పెండింగ్‌లో ఉన్న పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో పాటు సంబంధిత ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

- విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ
- జీఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం
- ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క



**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ)తో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాండ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

## కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ తీవ్ర విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల మొత్తం ప్రక్రియను ఒక రాజకీయ డ్రామాగా మలిచారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల అభివృద్ధిపై సీఎం ఒక్క రోజైనా స్పష్టమైన ప్రకటన చేయలేదని సంజయ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న ప్రజాప్రతినిధిగా, రాజ్యాంగ పరిరక్షణ తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వడం ద్వారా మొదటి రాజకీయ నాటకానికి తెరలేపారని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పష్టత లేకపోయినా, తెలంగాణ జాతిపితగా పేర్కొన్న కే. చంద్రశేఖర్ రావుకు నోటీసులు జారీ చేయడం రెండో డ్రామా అని సంజయ్ ఆరోపించారు. ప్రజల దృష్టి మళ్లించడంలో సీఎం తనకే సాటి అని విమర్శించారు. దావోస్ పర్యటనపై స్పందిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 12 రోజుల పాటు దావోస్లో గడిపి, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై స్పష్టత ఇవ్వలేదని అన్నారు. పెట్టుబడుల అంశంపై మంత్రి శ్రీధర్ బాబు కూడా మాట్లాడలేదని విమర్శించారు. అందువల్ల ఆ పర్యటనను విహార యాత్రగా భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నప్పుడు మున్సిపాలిటీల్లో సభలు, మున్సిపల్ ఎన్నికలు ఉన్నప్పుడు గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇతర పార్టీలతో సంబంధాలు ఉన్నది కాంగ్రెస్‌నే కానీ, బీఆర్ఎస్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలకు తగిన నిధులు కేటాయించకపోతే ప్రజలు కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. జలవనరుల అంశంపై చర్చకు సిద్ధమని, ముఖ్యంగా దేవాదుల ప్రాజెక్టు మరియు కాళేశ్వరం ప్రాజెక్టులపై సమగ్ర చర్చ జరగాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు 'శ్రీరామ రక్ష' వంటిదని పేర్కొన్న సంజయ్, దాని వంర వమ్మతాలు తప్పనిసరిగా చేపట్టాలని అన్నారు. అసెంబ్లీని గౌరవించి ప్రతిపక్షానికి మైక్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మారిన ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌పై అనర్హత వేటు వేయగా, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేసిన పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కూడా ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. మొత్తంగా, మున్సిపల్ ఎన్నికల ముగింపు వరకు అభివృద్ధి అంశాలను పక్కన పెట్టి వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.



# జిల్లా జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

## మాజీమంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ భేటీ

## బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి వాయిదా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 23:** ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని, జైలులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 14 మంది గెలిచినా మంత్రి వివేక్ అధికార దౌర్జన్యంతో ఎన్నికలను నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసి బీఆర్ఎస్ నాయకులపైనే కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. సుమన్ పై ఉన్న పాత కేసులు తోడి బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. అధికార పార్టీ దౌర్జన్యాలను అడ్డుకుంటామని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. జైలులో అధికారులు సుమన్‌ను మానసిక శోభకు గురి చేస్తున్నారని, దోమలు బాగా ఉన్న పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తెలిపారు. కొంత అనారోగ్యానికి గురైన వైద్యం అందించడం లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఇదిలావుంటే రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్ పై వాదనలను కోర్టు నేటికి వాయిదా వేసింది. జిల్లా జైలులో ఉన్న బాల్కసుమన్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణకు రాగా కోర్టు పరిశీలించింది. కౌంటర్ పిటిషన్ పై గడువు కావాలని పోలీసులు కోరగా బెయిలు పిటిషన్ పై వాదనలను రేపటికి వాయిదా వేసింది. జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించింది. పోలీసులను, ప్రభుత్వాన్ని నిలదీసిన బాల్కసుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది . గత వారం రోజులకు పైగా సుమన్ మంచిర్యాల జిల్లా జైలులో ఉన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు బంద్ నిర్వహించాయి
.



# కేజీబీవీ బెడ్స్ టెండర్లలో 100 కోట్ల కుంభకోణం

## లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** కేజీబీవీ బంకర్ బెడ్స్ టెండర్లలో జరిగిన రూ.100 కోట్ల కుంభకోణంపై వెంటనే సీబీఐ విచారణ జరపాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభకోణం విషయంలో ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం లో చలనం లేదని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి అడ్డుకట్టలేకుండా కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ విద్యార్థులు చదువుకునే కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక వసతుల పేరుతో ఈ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని పేర్కొన్నారు .నాసిరకం బంకర్ బెడ్స్ సరఫరా చేసి టెండర్లలో నియమ నిబంధనలను ఉల్లంఘించి ట్రూఫా , ముఫత్లాన్ కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ. 12 వేల ఒక బెడ్డును లోకల్ ఎంఎస్ఎంఈలకు లకు లబ్ది చేకూర్చాలనే ఉద్దేశంతో టెండర్‌లో భాగస్వామ్యం చేసారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అదే బెడ్డును రూ. 35 వేలకు మధ్యప్రదేశ్ నుంచి కొనుగోలు చేస్తూ ఒక్కో బొడ్డుపై 22 వేల రూపాయలను ఎస్టిమేషన్ కాస్ట్ పెంచి కాంట్రాక్టర్‌కు లబ్ది చేకూర్చారని ఆరోపించారు. మొత్తం 45,360 బెడ్‌లకు గాను ఒక్కో బెడ్డుకు రూ. 33,446 అందజేస్తున్నాని, దాదాపుగా రూ. 164 కోట్ల రూపాయలను ఢిల్లీలో రాహుల్ గాంధీకి చేరవేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కుంభకోణంపై వెంటనే సీబీఐతో న్యాయ విచారణ జరపాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

# హౌజింగ్ బోర్డు భూములకు రెక్కలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23:** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హౌసింగ్ బోర్డు భూములు అధిక ధరలు పలికాయి. గచ్చిబౌలి, భౌరంపేట్, బాలాజీ నగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని మొత్తం 14 స్థలాలను బహిరంగ వేలం వేశారు. వీటిలో గచ్చిబౌలిలోని భూమి చదరపు గజం రూ.1.76 లక్షలు, కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు పలికింది. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల ఆదాయం సమకూరింది. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ వేలంలో 50 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
మంగళవారం 24 ఫిబ్రవరి 2026



# పాఠశాల తాగు నీటి పైపులను ధ్వంసం చేసిన దుండగులు

**పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసిన ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కూచిపూడి జగదీష్**

**నేటిసాక్షి, తిరుమలాయపాలెం(రుద్రరాజు):** మండలపరిదిలోని బచ్చోడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రాగు నీటి సరఫరా పైపులను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఒక పైపును తీసుకెళ్లారని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.కృష్ణ మోహన్ స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ ఘటనను గ్రామపంచాయతీ సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ గ్రామ వార్డు సభ్యులు 7,9 వార్డు సభ్యులు, రామకృష్ణ, రాజు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గొర్రెపాటి రమేష్, వీరస్వామి లు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, వీలైతే పాఠశాలకు సహకరించండి కానీ దయచేసి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దనని వారి కోరారు. గతంలో కూడా రెండుసార్లు ఇలానే పైపులను ధ్వంసం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా గొర్రెపాటి రమేష్ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న విద్యాలయం, దేవాలయం కంటే గొప్పది అని అలాంటి విద్యాలయం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి తప్ప ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడి పాఠశాలలోని విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను దూరం చేయవద్దని వారు కోరారు. గ్రామ పాలకవర్గం వెంటనే పాఠశాలలోని పైపు మరమ్మతులను చేపట్టి విద్యార్థులకు ఇబ్బంది కలవకుండా నీటి వసతులను ఏర్పాటు చేయాలని వారు కోరారు. అలాగే నీటి సరఫరా పైపులను ధ్వంసం చేసిన వారిని గుర్తించి తగిన ప్రజలు తీసుకోవాలని రమేష్ కోరారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కూచిపూడి జగదీష్**




పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్ ఫిర్యాదు అందించిన వెంటనే స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ వెంటనే స్పందించారు. పాఠశాలకు చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించారు. వీలైనంత తొందరలోనే దోషులను గుర్తిస్తామని వారు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల అవరణంలోని నిఘా యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు.

# నేడే సుబ్లేడు నూతన సంత ఏర్పాటు

**సుబ్లేడ్ మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్**

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు ):** తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా సంత ఏర్పాటు చేయబడిందని . ఈ సంతను ప్రతి మంగళవారం రోజున నిర్వహించనుండగా గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో రైతులకు న్యాయమైన ధర లభించనుందని నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి సూచనల మేరకు గ్రామ సర్పంచ్ సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ నేతృత్వంలో ఈ నూతన సంత ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు. ఈ సంత ప్రారంభంతో స్థానిక రైతులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గ్రామంలో నిత్యావసరాల కొనుగోలు సులభమవడంతో ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు హర్షాతిరేకాలతో స్వాగతిస్తూ సంతను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు



# అమెరికాలో సుంకాల విధింపు నిలిపివేత

- సుప్రీం తీర్పుతో దిగొచ్చిన ట్రంప్ సర్కార్!
- మంగళవారం నుంచి వసూళ్లు బంద్
- కస్టమ్స్ శాఖ అధికారిక ప్రకటన



**వాషింగ్టన్, ఫిబ్రవరి 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అంత ర్జాతీయ సుంకాల విధింపునకు బ్రేక్ పడింది. ఆర్థిక ఎ మర్జెన్సీ పేరిట విదేశీ వస్తువులపై విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు తలొగ్గిన ప్రభుత్వం, మంగళవారం నుంచి వాటిని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డ ర్స్ ప్రొటెక్షన్ (సీబీపీ) శాఖ తాజాగా ఒక ప్రకటన విడు దల చేసింది. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ (ఐఈఈపీ) చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పుతో పాత పద్ధతిలో సుంకాలు నిలిచిపోయినప్పటికీ, ట్రంప్ తన మొండి వైఖరిని మాత్రం వీడలేదు. గతంలో ప్రకటించిన 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ను ఏకంగా 15 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఐఈఈపీఏ చట్టం స్థానంలో 'వాణిజ్య చట్టం-1974'లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ వసూళ్లకు తెరతీశారు. అయితే, దీనిని కూడా చట్టసభల అనుమతి లేకుండా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేకపోవడం గమనార్హం. మరోవైపు స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్లపై జాతీయ భద్రత పేరిట గతంలో విధించిన సుంకాలు యథాతథంగా కొనసాగుతాయని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి.

**రీఫండ్స్ సెగ: ట్రంప్‌కు ఎదురుగాలి**

సుంకాల విధింపు చెల్లదని కోర్టు తేల్చడంతో, ఇప్పటివరకు వసూలు చేసిన సుమారు 133 బిలియన్ల నుండి 175 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 15 లక్షల కోట్లు) నిధులను తిరిగి చెల్లించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇల్లినాయ్ గవర్నర్ ఇప్పటికే 9 బిలియన్ డాలర్ల రీఫండ్ కోసం ట్రంప్‌కు బిల్లులు పంపగా, కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు కోర్టు మెట్లు ఎక్కాయి. సుంకాల భారం విదేశీయులపై పడిందని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, దాదాపు 96 శాతం భారం అమెరికన్ కస్టమర్లే భరించాల్సి వచ్చిందని న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్ వంటి సంస్థల అంచనాలు చెబుతున్నాయి.

**కొనసాగనున్న న్యాయపోరాటం:**

రీఫండ్స్ ప్రక్రియ అంత సులభం కాదని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ పేర్కొన్నారు. వేల సంఖ్యలో ఉన్న దిగుమతిదారుల అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకు పెను సవాలుగా మారనుంది. ఈ న్యాయపరమైన చిక్కులు కొలిక్కి రావడానికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పట్టవచ్చని స్వయంగా అధ్యక్షుడు ట్రంపే అంగీకరించారు. మొత్తానికి సుప్రీంకోర్టు తీర్పుతో ట్రంప్ తన సుంకాల విధానంలో మార్పులు చేయాల్సి వచ్చినా, కొత్త చట్టాల ద్వారా తన 'రక్షణాత్మక వాణిజ్య' యుద్ధాన్ని కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

- అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతరామన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉ న్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.. భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,724 పెరిగి.. రూ.1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.15,931 పెరిగి రూ.2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు' అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..



# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

**ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం**

**శ్రీనగర్, ఫిబ్రవరి 23:** జమ్మూకశ్మీర్‌లోని కిస్ట్‌వార్ జిల్లాలో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో మరో దారుణం

**హిందూ దివ్యాంగురాలిపై సామూహిక లైంగికదాడి**



**ఢాకా, ఫిబ్రవరి 23:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అకృత్యాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్‌పుర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై లైంగికదాడి కి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది.ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు నిరసనలకు దిగారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత**

**కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3న జరిగిన మంత్రివర్గ స మావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీం కోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సు ప్రీం కోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

# సేవా స్ఫూర్తితో మెరిసిన మినీ ట్యాంక్ బండ్

- కోరుట్లలో 'ప్రాజెక్ట్ అమృత్' అద్భుతం
- శ్రీ సద్గురు మాతా సుదీక్షా జీ ఆదేశాలతో సంత్ నిరంకారి మిషన్ శుభ్రత సేవ
- చెత్తాచెదారం తొలగింపు.. మళ్లీ విహార కేంద్రంగా మారిన మద్దుల చెరువు



ఒకప్పుడు చెత్తాచెదారంతో, మద్యం సీసాలతో నిండిపోయి ప్రజలు అడుగుపెట్టడానికే భయపడిన కోరుట్ల 'మినీ ట్యాంక్ బండ్'.. ఇప్పుడు సంత్ నిరంకారి మిషన్ భక్తుల స్వచ్ఛంద సేవతో మళ్లీ చూడముచ్చటగా మారింది. 'ప్రాజెక్ట్ అమృత్'లో భాగంగా చేపట్టిన ఈ ప్రక్షాళన కార్యక్రమం పట్టణ ప్రజల్లో కొత్త స్ఫూర్తిని నింపింది.



## బ్రాంచ్ 1257 ఆధ్వర్యంలో విశేష స్పందన

కోరుట్ల శ్రీ సంత్ నిరంకారి మిషన్ బ్రాంచ్ 1257 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిరంకారి సేవాదళ్ సభ్యులు, ముఖి జి మరియు అనేక మంది భక్తులు పాల్గొన్నారు. చెరువు పరిసరాల్లో పేరుకుపోయి-ున ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు, ఇతర చెత్తను సేకరించి కట్టను పూర్తిగా శుభ్రపరిచారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంటల పాటు శ్రమించి ప్రాంతాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

**- నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య)**

## నిర్లక్ష్యంతో నిర్జనంగా మారిన విహార స్థలం

కోరుట్ల పట్టణంలోని మద్దుల చెరువు వద్ద ఉన్న మినీ ట్యాంక్ బండ్ ఒకప్పుడు ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశం. ఉదయాన్నే నడకకు వచ్చే వృద్ధులు, సాయంత్రం కుటుంబాలతో విహరించే వారు, పిల్లల ఆటపాటలతో కళకళలాడేది.కానీ కాలక్రమేణా చెత్త పేరుకుపోవడం, పరిసరాలు మురికిగా మారడం, మున్సిపల్ నిర్లక్ష్యం కారణంగా కట్టపై చెత్త కుప్పలు పెరగడం వంటి పరిస్థితులు తలెత్తాయి. దీంతో కుటుంబాలు, ముఖ్యంగా పిల్లలు అక్కడికి రావడం మానేశారు. కట్టపై తాగుబోతులకు నిలయంగా, గంజాయి బాపతుగాళ్లకు స్థావరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు సందడిగా ఉన్న ప్రదేశం నిర్మానుష్యంగా మారింది.







## మళ్లీ కళకళలాడే దిశగా అడుగులు!

శుభ్రత అనంతరం మినీ ట్యాంక్ బండ్ మళ్లీ చూడముచ్చటగా మారింది. పరిశుభ్రమైన వాతావరణం స్థానికులకు ఆనందాన్ని కలిగించింది. 'ఇప్పుడైనా కుటుంబాలతో మళ్లీ రావచ్చని అనిపిస్తోంది' అని పలువురు అభిప్రాయపడ్డారు.సామాజిక బాధ్యతతో చేపట్టిన ఈ కార్యక్రమం కోరుట్ల ప్రజలకు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్త కుప్పల మధ్య నిలిచిపోయిన మినీ ట్యాంక్ బండ్.. ఇప్పుడు సేవా స్ఫూర్తితో మళ్లీ జీవం పొందింది. ఇది నిజంగా సమాజానికి స్ఫూర్తిదాయక ఘట్టమని పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.!



## సద్గురు ఆదేశాలతో సేవా యజ్ఞం!

ఇలాంటి పరిస్థితుల్లో 'సంత్ నిరాంకారి మిషన్' ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ అమృత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సుదీక్షా జీ మహారాజ్ ఆదేశాల మేరకు, 'బాబా హరదేవ్ సింగ్ జీ మహారాజ్' జయంతిని పురస్కరించుకుని మద్దుల చెరువు వద్ద నిరంకారి భక్తులు ప్రత్యేక శుభ్రత కార్యక్రమం చేపట్టారు. హరదేవ్ సింగ్ జీ మహరాజ్ జీవిత కాలంలో ఇచ్చిన సేవా స్ఫూర్తిని అనుసరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నిర్వాహకులు వంగ ప్రభాకర్ తెలిపారు. 'స్వచ్ఛ జల -- స్వచ్ఛ మనసు' అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా వేలాది జలాశయాలను శుభ్రపరచడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.



# మా హయాంలోనే గజ్వేల్ అభివృద్ధి

- **మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన**



**నేటి సాక్షి గజ్వేల్:** కులాలకు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ కుల సంఘాల భవనాలను ఏర్పాటు చేసినట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన తెలిపారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని విశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చందన మాట్లాడుతూ, గత తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కెసిఆర్ సహకారంతో గజ్వేల్ పట్టణంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా అన్ని కుల సంఘాలు, ప్రజాసంఘాల కోసం ప్రత్యేక భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న భవనాలకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆమె విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకానికి తగిన నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్మించిన భవనాలకు సున్నం వేయడం తప్ప గజ్వేల్‌లో కొత్తగా అభివృద్ధి పనులు చేయలేదని ఆమె ఘాటుగా విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న కుల సంఘాల భవనాలకు ప్రత్యేక నిధుల ద్వారా పనులు పూర్తిచేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనుమయ సంఘం అధ్యక్షులు గడియారం వెంకటాచారి, కొక్కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గడియారం వెంకటేష్ చారి, గడియారం సామీ చారి, ప్రధాన కార్యదర్శి ముత్యాల విఠలాచారి, అరుణోజి లక్ష్మీనరసింహ చారి, కోశాధికారి నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి అరుణ శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ పెట్టా చారి, డాక్టర్ వాసవచారి, దత్తాత్రి చారి, యాదగిరి చారి, దశరథం చారి హాజరయ్యారు.

# మరికల్ లో బీజేపీ నిరసన



నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్): నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ఇంద్ర గాంధీ చౌరస్తాలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ మరికల్ మండల అధ్యక్షులు మంగలి వేణుగోపాల్ మాట్లాడుతూ.. పురపాలక సంఘ ఎన్నికల్లో బిజెపి అలూయమైన విజయాలను నమోదు చేసుకున్నందుకు ఓర్వలేక కామారెడ్డి ఎమ్మెల్యే ఇంటిపై దాడులు చేసిన రేవంత్ రెడ్డి గుండాల దాటిని వ్యతిరేకిస్తూ పరామర్శించడానికి వెళ్లిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుని అరెస్టు చేయడం రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రాక్షస పాలనకు అద్దం పడుతుందని ఇది ఎంతో కాలం కొనసాగు సాగదని దీనికి అంతం పొందలలోనే ఉంటుందని వచ్చే స్థానిక ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలలో కూడా దీనికి మూల్యం చెల్లించుకోవాల్సింది అని కాంగ్రెస్ పార్టీ ఎత్తిస్తున్నాము ఇప్పటికైనా ప్రజాస్వామ్య మార్గంలో ప్రయాణిస్తే తప్ప కాంగ్రెస్కు పుట్టకథలు ఉండవని రేవంత్ రెడ్డి గారి తన పద్ధతిని మార్చుకొని ప్రజాస్వామ్య పాలనకు అనుగుణంగా తన పాలన మార్చుకుంటే తప్ప కాంగ్రెస్కు భవిష్యత్తు ఉండదని హెచ్చరిస్తున్నాము. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గారి అధ్యక్ష అరెస్టును ఖండిస్తూ ఇప్పటికే ఆ పేరు మీద అరెస్టు చేసిన బిజెపి కార్యకర్తలను విడుదల చేసి కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ నిరసన కార్యక్రమంలో కన్మనూరు గ్రామ సర్పంచ్ సురేందర్ గౌడ్, మరికల్ వార్డు సభ్యులు రాజు, మండల నాయకులు రమేష్ రాజేష్, కోసూరు రవి సింహాచలం నరేష్ గౌడ్ అశోక్ కుమార్, వెంకటేష్,సింహాచలం, మాజీ ఉపసర్పంచ్ సీమ శివకుమార్, తిరుపతయ్య, స్వామి శెట్టి, సి రవి, కే రాములు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపులి సంచారంపై ప్రభుత్వ విప్ ఆరా!

- **ఫారెస్ట్ రేంజు అధికారులను వివరాలడిగిన ప్రభుత్వ విప్..**
- **పాదముద్రాల గుర్తించినట్లు తెలిపిన ఫారెస్ట్ అధికారులు..**



**నేటిసాక్షి ప్రతినిధి చందుర్తి(సతీష్) :** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి - మోత్కూరావుపేట అటవీప్రాంతంలో పెద్దపులి సంచారిస్తుంది అనే సమాచారంతో సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫారెస్ట్ రేంజ్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజుల క్రితం మోత్కరావుపేట (చందుర్తి - తొర్తి) అటవీ ప్రాంతంలో పాదముద్రాల గుర్తించినట్లు ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. మోత్కూరావుపేట నుండి చందుర్తి అటవీ ప్రాంత రోడ్డు గుండా వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. స్థానిక ప్రజల్లో భయం నెలకొన్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అటవీ శాఖ అధికారులకు ప్రభుత్వ విప్ సూచించారు. గ్రామస్తుల భద్రత దృష్ట్యా సమీప గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. పులుల సంచారం ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, పశువులను సురక్షిత ప్రదేశాల్లో కట్టివేయాలని ప్రజలకు తెలియజేయాలని అన్నారు..

# సేవామూర్తి స్వరూప రాణికి సత్కార వీడ్కోలు

## 34 ఏళ్ల సేవలకు వీడ్కోలు

## నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూప రాణి పదవీ విరమణ



నేటి సాక్షి, గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన స్వరూప రాణి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వరూప రాణి 34 సంవత్సరాల పాటు వైద్య ఆరోగ్యశాఖలో నర్సింగ్ రంగంలో అంకితభావంతో సేవలందించి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్‌ఉ2గా పదోన్నతి పొంది పలు ఆసుపత్రుల్లో తన కర్తవ్యాన్ని సమర్థంగా నిర్వర్తించారని తెలిపారు. ఆమె పదవీ విరమణ భాధాకరమైనప్పటికీ, ఉద్యోగరీత్యా పదవీ విరమణ అనివార్యమని పేర్కొన్నారు. స్వరూప రాణి సేవాభావం, క్రమశిక్షణ, రోగుల పట్ల చూపిన మానవతా దృక్పథం ఇతర సిబ్బందికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆసుపత్రి సిబ్బంది, సహచరులు ఆమెను శాలువా కప్పి సత్కరించి, స్మారక చిహ్నం అందజేశారు. పదవీ విరమణ అనంతరం స్వరూప రాణి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ ఎం ఓ రాము , శ్రీధర్, సాయి కిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ ప్రణీత తో పాటు ఆసుపత్రి సిబ్బంది వివిధ విభాగాల సిబ్బంది సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మరుపురాని జననాయకుడు
# నారాయణ ముదిరాజ్

**పెంటమీది కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి**

**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** మరపురాని జననాయకుడు పెంట మీది నారాయణ ముదిరాజ్ అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ప్రజా నాయకుడు మరుపురాని జననాయకుడు పెంట మీద నారాయణ ఏకాదశ దినకర్మ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యారు. పెంట మీద నారాయణ కుటుంబ సభ్యులైన పి నర్సింలు, సహదేవ్, మరికల్ ఒకటో వార్డు సభ్యులు రాజేశ్వరి రాఘవేంద్ర, తిమ్మన్న, పిపి సత్తన్న రాములు ఎంకన్న, లక్ష్మన్న పి వెంకన్నను మంత్రి వాకిటి శ్రీహరి పరామర్శించారు. అదేవిధంగా మహబూబ్నగర్ జిల్లా ముదిరాజ్ సంగం ఉమ్మడి జిల్లా నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి, సర్పంచ్ చెన్నయ్య, మాజీ సర్పంచ్, గోవర్ధన్, అనిమిరెడ్డి, సంపత్ కుమార్, సింగల్ విండో చైర్మన్ వై వెంకట్రామిరెడ్డి, భీమన్న, గోవర్ధన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం అందక పసికందు మృతి

**మరికల్ పీహెచ్‌సీలో రెగ్యులర్ డాక్టర్ నియామకం కోరుతూ తల్లిదండ్రుల ఆవేదన**



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్‌సాబ్):** నారాయణపేట జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన పసికందుకు సమయానికి చికిత్స అందక మృతి చెందిన సంఘటన మరికల్ మండల కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. నారాయణ పేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రం అశోక్ నగర్ కాలనీకి చెందిన స్వప్న, ఆంజనేయులు తమ చిన్నారి కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఈ నెల 14న రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో మరికల్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) తీసుకెళ్లారు. అయితే ఆ సమయంలో ఆసుపత్రిలో డాక్టర్ అందుబాటులో లేరని, కేవలం సిబ్బంది మాత్రమే ఉన్నారని బాధితులు తెలిపారు. తమ పిల్లకు తక్షణ చికిత్స అవసరమని చెప్పగా, దేవరకద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు మరికల్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడే పసికందు మృతి చెందినట్లు రోదిస్తూ తెలిపారు. “మరికల్ పీహెచ్‌సీలో రెగ్యులర్ డాక్టర్ ఉంటే మా బిడ్డ ప్రాణాలు దక్కేవి” అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుందని ఆరోపించారు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి మరికల్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయంలో కూడా రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

# తాసిల్దార్ కార్యాలయంలో పోస్టులు భర్తీ చేయాలి

**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంకేంద్రం లోని తాసిల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ మండల కార్యదర్శి చోక్కల శ్రీశైలం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతల అంజిరెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రజావాణి లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గన్నేరువరంలో భూ సమస్యలు చాలావరకు పెండింగ్లో ఉన్నాయి. భూ భారతిలో వచ్చినటువంటి దరఖాస్తులు వెంటనే పరిష్కారం చూపాలని సిబ్బంది నియమించి వచ్చిన సమస్యను పరిష్కారం కొరకై చొరవ చూపాలని అన్నారు. కొన్ని గ్రామాలకి ఇన్చార్జి జి పి లను మాత్రమే నియమించారు. భూ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. వెంటనే అధికారులను నియమించి భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు.



TGTEL/25/A1737 | NETI SAKSHI



### మేము వచ్చింది కేవలం ఆడటానికి కాదు..

# గెలవడానికి!

### టీమిండియాకు సికందర్ రజా మాస్ వార్నింగ్..

**ఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిపోయిన టీమిండియా ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిలో ఉంది. భారత్ సెమీఫైనల్‌కు వెళ్లాలంటే తదుపరి మ్యాచులు కచ్చితంగా గెలవాల్సిందే. ఈ తరుణంలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

#### భారత్‌కు రజా ఇచ్చిన మెసేజ్ ఏంటి..

చాలా ఏళ్లుగా జింబాబ్వే భారత్‌లో టీ20 మ్యాచ్‌లు ఆడలేదు. అయితే, దీన్ని ఒక సాకుగా తాము చూపించబోమని సికందర్ రజా స్పష్టం చేశారు. “పరిస్థితులు ఎలా ఉన్నా, పిచ్ చిన్నదైనా పెద్దదైనా.. రెండు జట్లకు ఒకేలా ఉంటుంది. భారత్ విసిరే సవాలును స్వీకరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం” అని ఆయన గంభీరంగా ప్రకటించారు. ఒకప్పుడు బలహీనమైన జట్టుగా భావించిన జింబాబ్వే, ఈ ప్రపంచకప్‌లో అద్భుతాలు చేస్తోంది. గ్రూప్ దశలో శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి దిగ్గజ జట్లను ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు సూపర్-8లో భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ వంటి బలమైన జట్లతో తలపడాల్సి ఉన్నా.. ఆ జట్టు ఆత్మవిశ్వాసం ఏమాత్రం తగ్గలేదు.

#### సెమీఫైనల్ రేసుపై రజా ఏమన్నారంటే..

జింబాబ్వే సెమీఫైనల్‌కు చేరుకుంటుందని ఎవరూ ఊహించలేదని రజా నవ్వుతూ అన్నారు. “మమ్మల్ని ఎవరూ టాప్-4లో ఉంటారని అనుకోలేదు. కానీ ఆ సవాలే మాలో కసిని పెంచుతోంది. మేము కేవలం టోర్నీలో పాల్గొనడానికి రాలేదు, పూర్తి శక్తితో పోటీ పడి గెలవడానికి వచ్చాం” అని టీమ్ ఇండియాకు పరోక్షంగా హెచ్చరిక జారీ చేశారు. ఒకవేళ భారత్ గనుక జింబాబ్వేను తక్కువ అంచనా వేస్తే.. సెమీఫైనల్ ఆశలు గల్లంతయ్యే ప్రమాదం ఉందని క్రీడావిశ్లేషకులు చెబుతున్నారు.

# వైభవ్ సూర్యవంశీకి టాటా మోటర్స్ స్పెషల్ గిఫ్ట్..

### టాటా కర్వ్ ఎస్‌యూవీ కారు బహుకరణ

బీహార్‌కు చెందిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. ముఖ్యంగా ఐపీఎల్2025 సీజన్ లో అత్యధిక స్ట్రైక్‌రేట్ నమోదు చేసి “కర్వ్ సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్” అవార్డును గెలుచుకున్నాడు. దీనితో ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ అతనికి ప్రత్యేక బహుమతిగా కొత్త టాటా కర్వ్ ఎస్‌యూవీ కారును అందించింది. వైభవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాట్నాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యాడు. అక్కడ కొత్త షోరూమ్ ప్రారంభోత్సవం అనంతరం టాటా కర్వ్ కారును అధికారికంగా స్వీకరించాడు. ఈ సందర్భంగా వైభవ్ ఆనందం వ్యక్తం చేశాడు. టాటా కర్వ్ ఎస్‌యూవీ ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ. 9.66 లక్షల నుంచి ప్రారంభమై రూ. 18.85 లక్షల వరకు ఉంటుంది. ఇది పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో అందుబాటులో ఉంది. టాటా కర్వ్ ఈవీ ధరలు రూ. 17.49 లక్షల నుంచి రూ. 22.24 లక్షల వరకు ఉంటాయి. ఈ ఎస్‌యూవీ స్మార్ట్, ప్యూర్+, క్రియేటివ్, అకంప్లిషెడ్ వంటి పలు వేరియంట్లలో లభిస్తుంది. టాటా కర్వ్‌లో 1.2 లీటర్ రేవోట్రాన్ పెట్రోల్, 1.2 లీటర్ హైపీరియన్ GDI టర్బో పెట్రోల్, 1.5 లీటర్ క్రయోజెట్ డీజిల్ ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. ఎలక్ట్రిక్ మోడల్‌లో 45 kWh, 55 kWh బ్యాటరీ ప్యాక్ ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, పానోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, 360-డిగ్రీ కెమెరా మరియు లెవల్-2 ADAS వంటి ఫీచర్లు ఉన్నాయి. భద్రత పరంగా కూడా 5-స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించింది.




# టీమిండియాలో ప్రక్షాళన

### నెక్స్ట్ మ్యాచ్‌లో ఆ స్టార్ ప్లేయర్‌కు ఉద్వాసన!

**ఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా కేవలం 111 పరుగులకే కుప్పకూలడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ముఖ్యంగా ఈ మ్యాచ్‌లో టీమిండియా ఎడమచేతి వాటం బ్యాటర్లు ప్రత్యర్థి ఆఫ్-స్పిన్నర్లను ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఈ దెబ్బతో ఫిబ్రవరి 26న జింబాబ్వేతో జరగబోయే కీలక మ్యాచ్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ జట్టులో రెండు పెద్ద మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

#### ఎవరిపై వేటు పడే అవకాశం ఉందంటే..

వరుసగా నాలుగు మ్యాచుల్లో విఫలమైన యువ ఓపెనర్ అభిషేక్ శర్మను తదుపరి మ్యాచ్‌లో పక్కన పెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. కేవలం లెఫ్ట్-హ్యాండ్ బ్యాటర్లే ఎక్కువగా ఉండటం టీమిండియాకు మైనస్‌గా మారింది. అందుకే వారి స్థానంలో రైట్-హ్యాండ్ బ్యాటర్లను తీసుకురావాలని మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వంటి వారు సూచిస్తున్నారు. చెన్నై వేదికగా జరిగే జింబాబ్వే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ స్థానంలో సంజూ శాంసన్‌ను ఆడించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కోగల సంజూ రాకతో జట్టు బ్యాటింగ్ బలోపేతం అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత రెండు మ్యాచులకు దూరంగా ఉన్న ఆల్ రౌండర్ అక్షర్ పటేల్‌ను తిరిగి తుది జట్టులోకి తీసుకోవడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఒత్తిడిలో బ్యాటింగ్‌తో పాటు, పొదుపుగా బౌలింగ్ చేయగల అక్షర్ జట్టుకు చాలా అవసరమని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.



#### ఇషాన్ కిషన్ పరిస్థితి ఏంటి..

ఈ టోర్నీలో ఇప్పటి వరకు 177 పరుగులతో భారత్ తరపున టాప్ స్కోరర్‌గా ఉన్న ఇషాన్ కిషన్, దక్షిణాఫ్రికాపై మాత్రం డకౌట్ అయ్యాడు. అయినప్పటికీ, అతని గత రికార్డు దృష్ట్యా అతనికి మరో అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జింబాబ్వేతో జరగబోయే మ్యాచ్ భారత్‌కు ‘డూ ఆర్ డై’ లాంటిది. ఎందుకంటే భారత్ ఈ మెగా టోర్నీలో సెమీఫైనల్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడంతో పాటు భారీ రన్ రేట్ సాధించడం కూడా ముఖ్యం. మరి సూర్యకుమార్ యాదవ్ ఎలాంటి మార్పులతో బరిలోకి దిగుతారో వేచి చూడాలి.



# జింబాబ్వే బౌలర్లకు ‘రక్తకన్నీరు’

### సిక్సర్లతో విరుచుకుపడ్డ విండిస్ బ్యాటర్లు!

- టీ20 వరల్డ్ కప్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు.
- సూపర్ 8 మ్యాచ్‌లో వెస్టిండీస్ 254/6 భారీ స్కోరు నమోదు..

**ముంబై:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా ముంబైలోని వాంఖేడే స్టేడియంలో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసి.. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరును నమోదు చేశారు. వెస్టిండీస్ బ్యాటింగ్‌లో హెట్మేయర్ కేవలం 34 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 సిక్సర్లు కొట్టి 250 స్ట్రైక్‌రేట్‌తో 85 పరుగులు చేసి జింబాబ్వే బౌలర్లను ఓ ఆట ఆడుకున్నాడు. అతనికి తోడుగా రోవ్మాన్ పావెల్ కూడా 35 బంతుల్లో 59 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. చివర్లో రూథర్ఫోర్డ్ (31*), రోమారియో షెఫర్డ్ (21), జాసన్ హోల్డర్ (13) వేగంగా పరుగులు చేసి స్కోరును 250 దాటించారు. వెస్టిండీస్ చివరి 5 ఓవర్లలోనే 75 పరుగులు సాధించడంతో భారీ స్కోర్ ను అందుకుంది. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ నగరవా, బ్లెస్సింగ్ ముజారాబని చెరో రెండు వికెట్లు తీసినా, విండీస్ బ్యాటర్ల దూకుడును అడ్డుకోలేకపోయారు. చూడాలిమరి విండీస్ బౌలర్లను జింబాబ్వే బ్యాటర్లు ఎంతవరకు ఎదురుకోగలరో.

# టీమిండియాకు 2012 ప్రపంచ కప్ గండం

### అప్పట్లాగే నెట్ రన్ రేట్ దెబ్బకొడుతుందా?

**ఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం మూటగట్టుకున్న భారత్, ప్రస్తుతం ఈ మెగా టోర్నీలో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ ఓటమితో భారత్‌కు సెమీఫైనల్ చేరడం ఒక పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం టీమిండియా నెట్ రన్ రేట్ -3.800 గా ఉంది. ఇది అభిమానులను తీవ్రంగా ఆందోళన కలిగిస్తుంది.

#### భారత్ ముందున్న మ్యాచులు ఇవే..

సెమీస్ చేరాలంటే టీమిండియా తన నెక్స్ట్ రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితిలో ఉంది. భారత్ ఫిబ్రవరి 26న జింబాబ్వేతో, మార్చి 1న వెస్టిండీస్‌తో తలపడబోతుంది. టీమిండియా సెమీస్ చేరాలంటే ఉన్న ఛాన్స్‌లు ఏమిటంటే.. దక్షిణాఫ్రికా తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ (జింబాబ్వే, విండీస్) గెలవాలి. అప్పుడు భారత్ తన రెండు మ్యాచ్‌లు గెలిస్తే, రన్ రేట్ తో సంబంధం లేకుండా నేరుగా సెమీస్ కి వెళ్తుంది. ఒకవేళ వెస్టిండీస్ జట్టు.. జింబాబ్వే, దక్షిణాఫ్రికాపై గెలిస్తే.. అప్పుడు భారత్, విండీస్, సౌతాఫ్రికా మూడూ తలో రెండు విజయాలతో సమానంగా ఉంటాయి. అప్పుడు ఎవరి రన్ రేట్ బాగుంటే వారే సెమీస్ కి వెళ్తారు. ప్రస్తుతం భారత్ రన్ రేట్ మైనస్‌లో ఉండటం పెద్ద సమస్యగా మారింది.

#### 2012 నాటి సీన్ రిపీట్ అవుతుందా..

సరిగ్గా 14 ఏళ్ల క్రితం (2012లో) టీమిండియాకు ఇలాగే జరిగింది. అప్పుడు సూపర్-8లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ భారీ తేడాతో ఓడిపోయింది. ఆ తర్వాత పాకిస్థాన్, దక్షిణాఫ్రికాపై గెలిచినప్పటికీ.. ఆస్ట్రేలియా కంటే తక్కువ రన్ రేట్ ఉండటంతో భారత్ సెమీస్ చేరకుండానే ఇంటికి వచ్చేసింది. ఆ టోర్నీలో భారత్ 3 మ్యాచ్‌ల్లో 2 గెలిచినా రన్ రేట్ వల్ల సెమీస్‌కు చేరకుండా తిరిగి రావాల్సి వచ్చింది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా మెరుగైన రన్ రేట్‌తో సెమీస్‌కి వెళ్లాయి. ఆ మెగా టోర్నీలో చివరికి వెస్టిండీస్ కప్పు కొట్టింది. సొంత గడ్డపై జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ ఒక్క మ్యాచ్ గెలిస్తే సరిపోదు, రన్ రేట్‌ను కూడా భారీగా మెరుగుపరుచుకోవాలి. ముఖ్యంగా వెస్టిండీస్, జింబాబ్వేపై భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవంగా ఉంటాయని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. లేదంటే 2012 నాటి కథే మళ్లీ పునరావృతం అవుతుందని అంటున్నారు.





# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు..

టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్'' అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.

# అల్లువారింట పెళ్లి సందడి

## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం







అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.





# ది ప్యారడైజ్ నుంచి ప్రోమో సాంగ్ విడుదల

నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్టలతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన జర్నీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయనకు విజయాలు రాత్రికి రాత్రే రాలేదు. ఆ ప్రయాణం మొత్తం ఈ పాటలో వినిపిస్తుంది' అని హరీష్ శంకర్ అన్నారు. అభిమానులు పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం చేస్తారని, కానీ దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటతో పాటాభిషేకం చేశారని, చంద్రబోస్ తన సిరాతో సిరాభిషేకం చేశారని ఆయన పేర్కొన్నారు. అయితే పవన్ కళ్యాణ్ డబ్బుకి ఏమాత్రం లొంగని వ్యక్తి అని హరీష్ శంకర్ స్పష్టం చేశారు. 'గబ్బర్ సింగ్' తర్వాత అనేక మంది నిర్మాతలు, కార్పొరేట్ సంస్థలు సినిమాలు, యాడ్స్ కోసం సంప్రదించారని తెలిపారు. 2012లోనే పాన్ ఇండియా అనే పదం లేకపోయినా, ఒక యాడ్ కోసం షారుఖ్ ఖాన్ తీసుకునేంత రెమ్యూనరేషన్‌ను పవన్ కళ్యాణ్‌కు ఆఫర్ చేశారని చెప్పారు. అయితే ఆరోగ్యానికి హానికరమైన లేదా చిన్నపిల్లలకు మంచిది కాని ఉత్పత్తులకు ప్రచారం చేయడం ఇష్టం లేక ఆయన కొన్ని కోట్ల రూపాయల యాడ్స్‌ను తిరస్కరించారని వెల్లడించారు. ఇక సినిమాలో సాంగ్స్, డాన్స్, డైలాగ్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ అన్నీ ఉంటాయి. 2 గంటల 35 నిమిషాల సినిమాలో దాదాపు 2 గంటలు పవన్ కళ్యాణ్‌ను తృప్తిగా చూస్తారు' అని హరీష్ శంకర్ నమ్మకం వ్యక్తం చేశారు.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మొత్తం 154 దరఖాస్తుల రాక

**నేటి సాక్షి, సిరిసిల్ల :** ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 154 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ముందుగా గత ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ శాఖా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 72, గృహ నిర్మాణ శాఖకు 17, జిల్లా పంచాయతీ అధికారికి 15, డీఆర్డీఓకు 8, జిల్లా సంక్షేమ శాఖకు 7, ఎండీ సెస్‌కు 6, ఎస్డీసీకి 5, జిల్లా విద్యాధికారి, ఉపాధి కల్పన అధికారికి 4 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా వైద్యాధికారికి మూడు చొప్పున, ఎస్పీ కార్యాలయానికి 2, జిల్లా అటవీశాఖ అధికారి, జిల్లా ఎక్సైజ్ శాఖ, జిల్లా ట్రెజరీ శాఖ, పశు సంవర్ధక శాఖ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సిరిసిల్ల, ఎంపీడీఓ ఎల్లారెడ్డిపేట, డీఎం ఆర్టీసీ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల,వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులను అభినందించిన పేట కలెక్టర్





**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పప్పెట్రీ పోటీలలో నారాయణపేట జిల్లా ఉపాధ్యాయులు ప్రథమ స్థానం సాధించడం జిల్లాకు గొప్ప గౌరవకారణమని గౌరవనీయ జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఘన విజయం సాధించిన శ్రీమతి శ్వేతా, ఎంపీపీస్ కమ్మాన్‌పల్లి మరియు శ్రీమతి అంబిక, కుర్వవాడ, ధన్వాడ గారిని జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేకంగా తన చాంబర్‌కు పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు చూపిన సృజనాత్మకత, అంకితభావం మరియు వినూత్న బోధనా పద్ధతులు జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చాయని ప్రశంసించారు. పప్పెట్రీ వంటి సృజనాత్మక విద్యా విధానాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తీకరణ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. ఇలాంటి విజయాలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచి జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లాలో అమలవుతున్న యంగ్ ఓరేటర్స్ క్లబ్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సామర్థ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ధైర్యాన్ని పెంపొందిస్తున్నాయని కలెక్టర్ గారు పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర వికాసానికి బలమైన పునాదిగా నిలుస్తాయని, ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే నారాయణపేట జిల్లా విద్యారంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే ఈ విజయానికి మార్గనిర్దేశం చేసిన జిల్లా విద్యాశాఖాధికారి (ఐజూ) గారిని కూడా కలెక్టర్ గారు అభినందిస్తూ, ఉపాధ్యాయులను ప్రోత్సహించే నాయకత్వం జిల్లాలో సృజనాత్మక విద్యా వాతావరణాన్ని ఏర్పరుస్తోందని కొనియాడారు. జిల్లాకు కీర్తి తీసుకువచ్చిన విజేత ఉపాధ్యాయులు మరియు వారిని మార్గనిర్దేశం చేసిన విద్యాశాఖాధికారికి జిల్లా పరిపాలన తరపున మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# ఆరాధన హక్కు అడిగితే అణచివేత.. బాధ్యులపై చర్యలెప్పుడూ?

## నిందితులపై వెంటనే కేసులు నమోదు చేయాలి: డీబీఎఫ్ డిమాండ్

**నేటి సాక్షి, గజ్వేల్:** నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో మల్లన్న స్వామి జాతర సందర్భంగా చోటుచేసుకున్న దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కుల వివక్షతో ఆలయానికి వెళ్లిన కుటుంబాన్ని అడ్డుకొని దాడి చేయగా, ఆ హింసలో రెండు నెలల పసికందు ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై వెంటనే కేసులు నమోదు చేసి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణులు, జిల్లా నాయకులు కొల్గూరి మైసయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. జాతర సందర్భంగా వెనుకబడిన వర్గానికి చెందిన చాకలి చంద్రకళ కుటుంబం దర్శనం కోసం ఆలయానికి వెళ్లగా, ప్రవేశ ద్వారం వద్ద వారిని అడ్డుకొని కుల దూషణలు చేస్తూ దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘర్షణలో పసికందు తీవ్రంగా గాయపడి అనంతరం మరణించిందని పేర్కొన్నారు. ఈ ఘటన సమాజానికి మచ్చగా నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక క్రిమినల్ ఘటన మాత్రమే కాదని, భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం, గౌరవం, ఆరాధనా స్వేచ్ఛ, మానవ హక్కులపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నిందితులపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ నాయకులు కోరారు.



# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య 36

**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి అర్జీపై సమగ్ర విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్, ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు.

### సమగ్ర విచారణ - తక్షణ చర్యలు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే వేదిక అని తెలిపారు. శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 36 ఫిర్యాదులు, వినతులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అప్పగించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి ఆర్డీఓలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజావాణి వేదిక కీలకంగా మారాలని జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని అధికారులు తెలిపారు.







# అధిక ఎరువుల వాడకం అనర్థమే

## గుల్లకోట రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం

**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని గుల్లకోట రైతు వేదికలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడం, దిగుబడులపై ప్రభావం పడటం వంటి సమస్యలపై ఉమ్మడి మండల వ్యవసాయ శాఖాధికారులు కమల్ల మహేష్, సాయి కిరణ్ లు రైతులకు వివరించారు. యూరియా వంటి ఎరువులను అవసరానికి మించి వాడటం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించి భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని, రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి మితంగా ఎరువులు వాడాలని సూచించారు. నానో యూరియా వినియోగం వల్ల తక్కువ పరిమాణంలోనే పంటలకు అవసరమైన నత్రజని అందుతుందని, ఖర్చు తగ్గడంతో పాటు పంటల వృద్ధి మెరుగుపడుతుందని వివరించారు. ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరించి, గోమయం, జీవామృతం వంటి సహజ వనరులతో సాగు చేస్తే నేల సారవంతత పెరిగి, దీర్ఘకాలంలో రైతులకు లాభదాయకమవుతుందని ఏవోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య, సందీప్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం జరగాలి

## జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలు

## గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులపై సమీక్ష



**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ రోజు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వినతులను స్వీకరించాలని, సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వేగంగా స్పందించాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడమే గ్రీవెన్స్ డే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బాధితుల విశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రతి ఫిర్యాదును గంభీరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా వేగవంతమైన స్పందనతో పోలీసు శాఖ ముందుకు సాగుతోంది.

# ఫారెస్ట్ అధికారులపై దాడి!

## నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష రూ. 2000 జరిమానా..





**నేటిసాక్షిప్రతినిధి, చందుర్తి (సతీష్):** 2018లో రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో అటవీ శాఖ అధికారులపై దాడి చేసిన కేసులో నలుగురి నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష తో పాటుగా రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు రుద్రంగి ఎస్ఐ మోతీరామ్ తెలిపారు. రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన గుగులోతు మదన్, గుగులోతు గజల్, అజ్మీర బన్సీ, బత్తుల లక్ష్మయ్య అనువారు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అయిన పేర్ల సిద్ధార్థ అను అతనిపై భౌతికంగా దాడి చేసి గాయపరిచినారని ఫిర్యాదు చేయగా 2018 సంవత్సరంలో అప్పటి రుద్రంగి ఎస్ఐ ఎస్. విద్యాసాగర్ రావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి కోర్టు నందు ఛార్జ్ షీట్ దాఖలు జరిగింది. ఇట్టి కేసులో కోర్టు కానిస్టేబుల్ సంద శ్రీనివాస్ కోర్టు నందు సాక్షులను ప్రవేశపెట్టి సాక్షాధారాలు నిరూపించగా, ఇట్టి కేసును కోర్టు పిపి విక్రాంత్ వాదించగా, ఇట్టి కేసులో పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు అందరికీ ₹2,000 జరిమానా విధించడం జరిగింది అని రుద్రంగి ఎస్ఐ మోతీరామ్ తెలిపారు. ఏ ప్రభుత్వ అధికారులపై గాని, అటవీ సిబ్బందిపై గాని ఎవరు దాడి చేసిన విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రుద్రంగి ఎస్ఐ మోతిరాం పేర్కొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

- డీఆర్ఎస్సీ సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్ స్పష్టమైన ఆదేశాలు
- బ్లాక్ స్పాట్ల గుర్తింపు ఉ రంబుల్ స్ట్రిప్స్, సీసీ కెమెరాలు, అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యం



**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మరియు డీఆర్ఎస్సీ చైర్మన్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రత కమిటీ (డీఆర్ఎస్సీ) సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రత అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. జిల్లాలో ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలు, తీసుకోవాల్సిన చర్యలపై విపులంగా చర్చించారు.

### ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాలపై ఆదేశాలు

జగిత్యాల పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును సమీక్షించిన కలెక్టర్, మరమ్మత్తుల కోసం సంబంధిత ఏజెన్సీకి నోటీసులు జారీ చేసినట్లు ఆర్&బి అధికారులు తెలిపారు. మంచినీళ్ల బావి సమీపంలో లైట్ల మార్పు, విద్యుత్ స్తంభాల మరమ్మత్తులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. బస్టాండ్ ప్రాంగణంలో సీసీ కెమెరాల లభ్యతను పరిశీలించి, పార్కింగ్ ప్రాంతంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను సూచించారు. సమీప ఆసుపత్రులకు తగిన అంబులెన్సులు అందుబాటులో ఉండేలా డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

### బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గుర్తించిన 8 బ్లాక్ స్పాట్ ప్రాంతాలపై ఆర్&బి శాఖ సమీక్ష నిర్వహించింది. జగిత్యాలఉపెద్దపల్లి రోడ్డులో రెండు ప్రాంతాల్లో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాయపట్నంఉకోదాడ రోడ్డులో రూ.23 లక్షల అంచనాతో సాంకేతిక అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. చైతన్య పాఠశాల సమీపంలో రూ.21.50 లక్షల ప్యాకేజ్ పనులకు అనుమతి లభించిందని వెల్లడించారు. మెట్ పల్లి ఉ రంగారావుపేట రోడ్డులో రూ.12 లక్షల అంచనాతో ప్రతిపాదనలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. వెల్గటూర్ వంతెనపై విద్యుత్ స్తంభాల మార్పు అనంతరం రోడ్డు భద్రత పనులు చేపడతామని పేర్కొన్నారు. గొల్లపల్లి బైపాస్ రోడ్డులో భవాని బార్ సమీపంలో గుంతలు పూడ్చే పనులను తక్షణమే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు.

### ఎన్‌హెచ్ రహదారులపై చర్యలు

ఎన్‌హెచ్-63పై 27 ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. ఎన్‌హెచ్-563లో 15 ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అవసరమైన చోట సైన్ బోర్డులు తక్షణమే ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కోరుట్ల పట్టణంలో పాఠశాల జోన్లు, ముఖ్య కూడళ్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్ అవసరమని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. మెట్ పల్లిలో ఆరపేట వై-జంక్షన్, పాత బస్టాండ్ వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు పక్కన పెరిగిన పొదలు, చెట్టు కొమ్మలను తొలగించాలని ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రమాదాలకు దారితీసే కట్టింగ్ ప్రాంతాల్లో మొరం లేదా గ్రావెల్‌తో పూడ్చాలని ఆదేశించారు.

### పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. యాదృచ్ఛిక వాహన తనిఖీలు నిర్వహిస్తూ అవసరమైన కేసులను ఆర్టీఓకు పంపించి లైసెన్సు రద్దు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. హెల్మెట్ ధారణపై కఠిన అమలు కొనసాగుతోందని, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

### సమన్వయంతో ముందుకు..

జిల్లాలో రోడ్డు భద్రత విషయంలో అన్నిరకాల చర్యలు సమగ్రంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు తమ తమ శాఖల ద్వారా చేపట్టిన చర్యలపై నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రమాద రహిత జగిత్యాల దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా యంత్రాంగం సంకల్పం వ్యక్తం చేసింది.




# మహిళా న్యాయవాదుల సదస్సుకు తరలిరండి

### ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు, గోడ పత్రికల ఆవిష్కరణ

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహిళా న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిస్తూ సోమవారం కోరుట్ల కోర్టు ఆవరణలో కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సుకు అధిక సంఖ్యలో మహిళా న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్రిపల్లి గంగాధర్ కోరారు. న్యాయ నిష్ణాతులైన ప్రముఖులు భారత న్యాయ వ్యవస్థ, ప్రస్తుత ముఖ్య న్యాయ అంశాలు, మహిళా న్యాయవాదుల పాత్రపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు మహిళా న్యాయవాదులకు వృత్తి పరమైన మార్గదర్శకత్వం అందించే వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### మహిళా న్యాయవాదులకు దిశానిర్దేశం

ఈ రాష్ట్ర స్థాయి సదస్సు ద్వారా మహిళా న్యాయవాదులు న్యాయ రంగంలో ఎదుర్కొనే సవాళ్లు, అవకాశాలు, చట్టపరమైన తాజా పరిణామాలపై స్పష్టమైన అవగాహన పొందుతారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా న్యాయవాదుల ఐక్యతకు ఈ సదస్సు దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సును విజయవంతం చేయడానికి కోరుట్ల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు

### న్యాయవాదుల సమక్షంలో ఆవిష్కరణ

కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్రిపల్లి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచాల రామకృష్ణ, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొంపల్లి సురేష్ పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు కడకుంట్ల సదాశివరాజు, మహిళా న్యాయవాదులు మద్దుల రోజా, తోట లలిత, న్యాయవాదులు గాంధారి శ్రీనివాస్, చిలివేరి రాజశేఖర్, భీమానది రఘు, వోర్సు రాములు తదితరులు హాజరయ్యారు.

# అంగన్‌వాడీ కార్మికుల వేతనాలు 26 వేలకు పెంచాలి

### సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు



**నేటి సాక్షి, మిడ్తూరు :** రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో 42 రోజుల మెరుపు సమ్మె కాలంలో శిబిరాలకు వచ్చి అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని మద్దతు తెలిపిన నేటి అధికార పార్టీ ఇచ్చిన హామీనీ అమలు చేయకుండా మోసపూరితంగా నిర్లక్ష్యం చేయడం తగదని తక్షణమే అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లేనిపక్షంలో మరో మెరుపు సమ్మెకు పిలుపునిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు హెచ్చరించారు.. సోమవారం మిడతూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట రాణేమ్మ అధ్యక్షతన అంగన్వాడీ కార్మికుల రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ రిలే దీక్షలను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు ప్రారంభిస్తూ మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా వేతనాలు పెంపుదల చేయాలని పోరాటం చేస్తున్న అంగన్వాడీ కార్మికులకు పాలకు ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. పెండింగ్లో ఉన్న 1810మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ అమలకు గైడ్లెన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్ రూరల్ తేడా లేకుండా అందరికి అమలు చేయాలని డిమాండ్ చేశారు,హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్ లైన్స్ రూపొందించి అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మే నెల అంతా వేసవి సెలవుల జీఓ విడుదల చేయాలని, లబ్ధిదారులకు బియ్యం, ఆయిల్, కందిపప్పు, క్వాంటిటీ పెంచి మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు,ఫ్రీ స్కూల్ బలోపే తం చేసి ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని,ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరినీ అంగన్వాడి సెంటర్లో ఉంచే విధంగా జీవో ఇవ్వాలన్నారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంపుదలపై దృష్టి కేంద్రీకరించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. గత సమ్మెకాలంలో ఎన్ని నిర్బంధాలు పెట్టిన లాఠి చార్జీలు చేసిన,ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ముందు నిలిచిన అంగన్వాడీలకు ఈ ప్రభుత్వం మద్దతు ఇచ్చినట్టు ఇచ్చి ఇప్పుడు విస్మరించడం తగదు అన్నారు. తక్షణమే వీరి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కమల,సౌజన్య, పుణ్యవతి ,సువర్ణ, కమల, వరలక్ష్మి, రవణమ్మ,శైలజ, మహాదేవి, భాగ్యమ్మ, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు..



# శంకర్ పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులుగా బద్దం శశిధర్ రెడ్డి

**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్ పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బద్దం శశిధర్ రెడ్డి నియమితులు అయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి జారీ చేసిన నియామక పత్రాన్ని సోమవారం నాడు మాజీ మంత్రి,బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. శంకర్ పల్లి మండల వైస్ ఎంపీపీ గా, సొసైటీ చైర్మన్ గా పనిచేసిన శశిధర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమ సమయంలో మండల పొలిటికల్ జేఏసి చైర్మన్ గా కూడా పనిచేశారు. ప్రస్తుతం ప్రయివేట్ విద్య సంస్థల చైర్మన్ గా కూడా కొనసాగుతున్నారు. తనపై నమ్మకం తో ఉంచిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి తెలిపారు. శంకర్ పల్లి పట్టణ పార్టీ అధ్యక్షునిగా నియమించినందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి లకు ధన్యవాదములు తెలిపారు. అదే విధంగా అండగా నిలిచిన మండల, మున్సిపాలిటీ పార్టీ పెద్దలకు, శ్రేణులకు ధన్యవాదములు తెలిపారు. పార్టీ అధిష్టానం ఎంతో నమ్మకంతో ఉంచిన బాధ్యతలను వమ్ము చేయకుండా కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. త్వరలో పూర్తి స్థాయి కమిటీ లు, అనుబంధ సంఘాల నియమాకాలు పూర్తి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు వేయి ఓట్ల తేడా మాత్రమే ఉందని,రానున్న కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తాము అన్నారు. సబితా రెడ్డి సహకారంతో పార్టీని తిరుగులేని శక్తిగా మారుస్తా అన్నారు. నూతన పట్టణ అధ్యక్షులుగా నియమితులు అయిన శశిధర్ రెడ్డిని ఈ సందర్భంగా పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**నేటి సాక్షి, జూపాడుబంగ్లా :** ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 23 వ తేదీన దేశవ్యాప్త నిరసన దినంలో భాగంగా ఏఐటీయూసీ బిల్డింగ్ యూనియన్ నాయకులు సలీమ్, సీపీఐ నాయకులు మాగబుల్ బాషా, పుల్లయ్య లు సోమవారం తహసీల్దార్ చంద్ర శేఖర్ నాయక్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు దేశంలోని పలు రాష్ట్రాల్లో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం 1996 అమలు జరుగుచున్నదని,అయితే చట్టం అమలు దేశవ్యాప్తంగా ఒకే పద్ధతిలో లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంటులో చట్టం చేసి మూడు దశాబ్దాలు గడిచినా కొన్ని రాష్ట్రాల్లో ఇంకా వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. వెల్ఫర్ బోర్డులు ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో కూడా పని తీరు సక్రమంగా లేదన్నారు.. ఆంధ్రప్రదేశ్ లో 2019 నుండి వెల్ఫేర్ బోర్డు నిర్వీర్యం అయ్యిందన్నారు. వెల్ఫేర్ సెస్ వసూళ్లు కూడా సవ్యంగా లేవని,వసూలు చేసిన సెస్సును వెల్ఫేర్ బోర్డుకు జమ చేయడం లేదని,భవననిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసే వెల్ఫేర్ సెస్సును భవన నిర్మాణ కార్మికుల కోసం మాత్రమే ఖర్చు చేయాల్సి ఉందని వారు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోని నిధులను వేరే పథకాలకు దారి మళ్లిస్తున్నాయన్నారు. దేశంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్సులో దాదాపు 67వేల కోట్ల రూపాయలు సొమ్మును ఖర్చు చేయలేదని వెల్లడి అయ్యింది. ఈ పరిస్థితులను చక్కదిద్ది భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదన్నరు..

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ రోడ్డు నుండి చిన్న శంకర్‌పల్లికి వెళ్లే రోడ్ గుంతల మయంగా మారింది. రోడ్డు సమస్యను వార్డు ప్రజలు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ వెంటనే స్పందించి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తన సొంత నిధులతో సిమెంట్ తో రోడ్డుకు సోమవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. వార్డు ప్రజలు కౌన్సిలర్ కు కృతజ్ఞతలు తెలిపారు.



## పోస్టర్ ఆవిష్కరించిన మినా కళాశాల చైర్మన్ మహమూద్ అలీ

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మార్చి 03 తేదీన పట్టణంలోని కళాభారతిలో "బుద్ధునితో నా ప్రయాణం నాటకం" డాక్టర్ మువ్వా రామారావు, డాక్టర్ జాడి రాజు ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు నాటకాన్ని ప్రదర్శించడం జరుగుతుందని, ఈ సందర్భంగా నిర్వాహకులు సోమవారం మినా కళాశాల చైర్మన్ మహమ్మద్ అలీ పోస్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ తన చివరి దశలో బుద్ధుని సిద్ధాంతాలకు ఆకర్షితుడై, బౌద్ధిజాన్ని స్వీకరించడం జరిగిందని, బుద్ధునితో తనకున్న అనుభవాన్ని వివరించడమే ఈ నాటక ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్ తాళ్లపల్లి రవి కందుకూరి సుదర్శన్, కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పసిపాప మృతికి కారణమైన దోషులను వెంటనే శిక్షించాలి



**నేటి సాక్షి, మంచిర్యాల :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో చాకలి చంద్రకళ కుటుంబంపై దాడి చేసిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని మంచిర్యాల పట్టణ రజక సంఘం అధ్యక్షులు పరిపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ పోశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా లో రాస్తారోకో, కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టరు.అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు అగ్రవర్ణ కుటుంబాల దుశ్చర్య సభ్యసమాజం తలదించుకునేల అవమానకరమైన సంఘటన అయినందున తమరు ఈ సంఘటనను మానవీయకోణంలో కన్సిడర్ చేసి, ఈ సంఘటనకు బాధ్యులనై వారందరిపై చట్టపరమైన కఠినాతికఠినమైన చర్యలు తీసుకుని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.లేని యెడల జిల్లాలోని రజకులు వృత్తి బంద్ కు పిలుపునివ్వడం జరుగుతుందని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి నస్పూరి పోశం, ముఖ్య సలహాదారు నేరెళ్ల రమేష్, బీసీ సంఘాల నాయకులు నరెడ్ల శ్రీనివాస్, గజెల్లి వెంకటయ్య, రజక సంఘం నాయకులు దొడ్డిపెల్లి రవీందర్, ఏదుళ్ల రాజాం, జంగపెల్లి సతీష్, తోటపెల్లి శ్రీనివాస్, ఒరగంటి సత్యనారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పట్టవా?: సిపిఎం



**నేటి సాక్షి, పాములపాడు:** అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్సీపీ లకు ప్రజాస్వామ్యానికి దేవాలయం అయినా శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించకుండా లేచిన దగ్గర నుండి ప్రతిరోజు తిరుపతి లడ్డుపై వివాదం చేయడం తగదని సిపిఎం మండల కార్యదర్శి డి. స్వామన్న అన్నారు. స్థానిక సిపిఎం ఆఫీసులో విలేకరుల సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ తిరుపతి లడ్డు వ్యవహారం పరస్పరం విమర్శలతో కాలం గడుపుతున్నారని పాలకులకు ప్రజా సమస్యలు వారి సంక్షేమం పట్టడం లేదని ప్రతిపక్ష నేతలు సైతం ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని విమర్శించారు. సున్నిత అంశమైన దానిని రాజకీయం చేయడం తగదన్నారు రాష్ట్రంలో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయని వాటిని పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ లో భాగంగా వాగ్దానాలైన ఆడబిడ్డ నిధి నిరుద్యోగ భృతి అన్నదాత సుఖీభవ ఎస్సీ ఎస్టీ బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ వంటి పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కౌలు రైతులు నిరుద్యోగులు మహిళలు వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై శాసనసభలో చర్చించక పోవడం దురదృష్టకరమన్నారు. రైతుల ఆత్మహత్యలు మహిళల చిన్నారులపై లైంగిక దాడులు కొనసాగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారిని పట్టించుకున్న పాపాన పోలేదని ఇప్పటికైనా అన్నదాత సుఖీభవ కింద 20000 ఇచ్చి వారిని ఆదుకోవాలన్నారు గ్రామలలో పనులు లేక వ్యవసాయ కూలీలు వలసలు పోతుంటే ఎందుకు ఉపాధి కల్పించలేక పోతున్నారన్నారు ఎన్ఆర్ఈజీఎస్ పేరు మార్చారు తప్ప ఉపాధిని ఎందుకు కల్పించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడంతో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఆర్ఎస్ఎస్ కాసాయి దళం విద్యార్థులపై దాడులకు తెగబడుతుంటే ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రానున్న రోజుల్లో ప్రజా సమస్యలను అధికారులు, పాలకులు, ప్రజాప్రతినిధులు వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మేకల.రాజు, రంగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల లబ్ధికి ఫార్మర్ ఐడీ తప్పనిసరి

### గజ్వేల్ డివిజన్‌లో నమోదు ప్రక్రియ వేగవంతం

### ఏడీఏ బాబు నాయక్





**నేటి సాక్షి , గజ్వేల్:** రైతులు ప్రభుత్వ పథకాల ద్వారా అందించే రాయితీలు, సబ్సిడీలు మరియు ఇతర ప్రయోజనాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయ డివిజన్ ఏడీఏ బాబు నాయక్ సూచించారు. అహ్మదీపూర్, పిడ్చెడ్ క్లస్టర్లలోని గ్రామాలను మండల వ్యవసాయ అధికారితో కలిసి సందర్శించిన ఆయన, రైతులకు ఫార్మర్ ఐడీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో పట్టాదార్ పాస్‌బుక్ కలిగిన రైతులు మొత్తం 56,399 మంది ఉన్నారని తెలిపారు. అందులో 30,027 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా, 26,372 మంది ఇంకా పెండింగ్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇప్పటివరకు 53.24 శాతం నమోదు మాత్రమే పూర్తయిందని చెప్పారు. మిగిలిన రైతులు త్వరితగతిన నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీ సేవా కేంద్రాలను సంప్రదించి ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు సమయంలో ఆధార్ కార్డు నంబర్, పట్టాదార్ పాస్‌బుక్ వివరాలు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సంవన్ నిధి పథకం లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు అవసరమని పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేయని రైతులకు భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అందకుండా పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వ్యవసాయ అధికారులు, ఏఈఓలు గణేష్, అంజలి తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే..



- మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకై కష్టపడ్డ క్యాడర్‌కు భవిష్యత్‌లో మంచి గుర్తింపు.
- మాజీ మంత్రి,బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ సబితా ఇంద్రారెడ్డి
- కౌన్సిలర్ స్థానాలకు బీజేపీ, ఇండిపెండెంట్ లుగా పోటీ చేసిన అభ్యర్థులు సబితా రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

**నేటి సాక్షి , శంకర్ పలి:** మునిసిపల్ ఎన్నికల్లో జిల్లాలో బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చిందని, పలు మున్సిపాలిటీలలో ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసిందని మాజీ మంత్రి, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సబితా ఇంద్రారెడ్డి అన్నారు.ఒక్క కౌన్సిలర్ గెలిచినా అమన్‌గల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చైర్మన్ అయ్యారని, దేశంలో వ్యతిరేకంగా పనిచేసే బీజేపీ, కాంగ్రెస్ అనైతిక పొత్తులు పెట్టుకున్నాయాన్నారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసిన వాసుదేవ్ కన్నా, శ్రీకాంత్ రెడ్డి, ఇండిపెండెంట్ గా పోటీ చేసిన సయ్యద్ ఆఫ్సర్ లు,బుల్కాపూర్ బీజేపీ పార్టీ నాయకులు రాంమోహన్ రెడ్డి, బుల్కాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ తదితరులు పెద్ద ఎత్తున తమ అనుచరులతో సబితా రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.వారికి గులాబీ కండువాలు వేసి బీఆర్ఎస్ లోకి ఆహ్వానించిన అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. శంకర్ పల్లి మునిసిపల్ లో కేవలం వేయి ఓట్ల తేడా మాత్రమే ఉందన్నారు.ఇబ్రహీంపట్నం లో స్పష్టమైన మెజారిటీ ఉన్న బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి చైర్మన్ గా ఎన్నికైన కూడా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. పరిగి లో కూడా ఇదే విధంగా చేశారన్నారు. రంగారెడ్డి జిల్లాలో అధికార పార్టీకి చెందిన 54 మంది కౌన్సిలర్ లు గెలిస్తే 47 మంది బీ ఆర్ ఎస్ తరుపున గెలిచారని, మరో 15 చోట్ల స్వల్ప తేడాతో బీ ఆర్ ఎస్ అభ్యర్థులు ఓటమి చెందారని అన్నారు. పార్టీ శ్రేణుల పోరాట పటిమ కు సబితా రెడ్డి అభినందనలు తెలిపారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచ్ లను సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గండి చర్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీలు వి సత్యనారాయణ, డి గోవర్ధన్ రెడ్డి, ఎం చిన్న నర్సింలు,మాజీ జడ్పీటీసీ నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ లు రాజు నాయక్, మాణిక్ రెడ్డి, బుచ్చి రెడ్డి, సర్పంచ్ లు రాఘవేందర్ రెడ్డి, నివేదిత ఇంద్ర సేన రెడ్డి,పాపారావు, అర్చన ప్రభూ గౌడ్,మల్లికార్జున్,మాజీ సర్పంచ్ బి శ్రీధర్, సత్యనారాయణ, సుధాకర్, శంకర్ నాయక్, శ్రీకాంత్, హన్మంత్ రెడ్డి,నర్సింహా రెడ్డి, కౌన్సిలర్ లు ఉషాకిరణ్ విజయ్, బానూరి కృష్ణ, నాయకులు ముంతాజ్,శ్రీనివాస్ గౌడ్, వి. మహేష్,వేణుగోపాల్ రెడ్డి, శేఖర్, రాజ్ కుమార్, శ్రీనాథ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# ఆపి ఉన్న లారీకి బైక్ ఢీ.. యువకుడు మృతి

### హెచ్చరికలు లేకుండా వాహనం నిలిపివేశారంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని సుభాష్ రోడ్డుకు చెందిన నల్లూరి నరేష్ (24), తండ్రి ఆనంద్, కులం సన్నాయిల, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. నరేష్ డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నెల 23న తెల్లవారుజామున సుమారు 1:30 గంటల సమయంలో తన స్నేహితుడి బైక్‌పై మెట్ పల్లి పట్టణంలోని ఒక ఫంక్షన్‌కు డెకరేషన్ పనికి వెళ్తున్నాడు.సుమారు రెండు గంటల సమయంలో కోరుట్ల ఎస్ఎఫ్ఎస్ స్కూల్ క్రాస్ రోడ్ సమీపంలో జాతీయ రహదారిపైకి చేరుకున్నాడు.ముందున్న లారీని గుర్తించకపోవడంతో నరేష్ ప్రయాణిస్తున్న బైక్ వెనుక నుంచి లారీకి ఢీకొట్టింది.దీంతో ప్రమాదంలో నరేష్ తలకు తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆ సమయంలో జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేదా హెచ్చరిక సూచనలు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా లారీని నిలిపివేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని రహదారిపై నిలిపివేశాడని ఆరోపిస్తూ మృతుని తల్లి నల్లూరి యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి పేర్కొన్నారు.యువకుడి ఆకస్మిక మృతి కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది.



# విజిలెన్స్ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నేటి సాక్షి, మంచిర్యాల :** నిరుపేద లబ్ధిదారులకు, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం క్రమ మార్గంలో పంపిణీ చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య తో కలిసి విజిలెన్స్ కమిటీ సభ్యులు, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం ను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని, రేషన్ బియ్యం తప్పుదారి పట్టకుండా పర్యవేక్షించాలని, రేషన్ బియ్యం దుర్వినియోగపరచిన లబ్ధిదారుల రేషన్ కార్డులు రద్దు చేయబడతాయని తెలిపారు. రేషన్ కార్డులలో చనిపోయిన వారి వివరాలు తొలగించాలని, పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# UAE JOBS 2026 - Earn 1.2 lakhs & More

noon FOOD | talabat | careem | keeta | amazon

*Hurry up!!! Exciting Opportunity for Indian Freshers*

# BIKE RIDERS

# Sal: 1,25,000/- Approx

*"The more you work hard, The more you earn"*



## AED 4500 - 6000

**SALARY + COMMISSION + INCENTIVES + TIPS**

**Walk-In Interview on 26th Febuary 2026 - Thursday**






- *Earning Potential 1,50,000/-*
- *International 2 WHEELER License*
- *Visa Sponsorship, 2years & Renewable*
- *Helmet, Sim card & Safety Kit*
- *Accommodation until License*
- *Medical, Car Insurance & Maintenance*

**AGE Limit 21 - 45**

**APPLY NOW : 7730077740 / 7730077750**

## THE JOB EXPO INDIA

"We are your source of Livelihood - Hum apke rozgaar ka zariya hai"




WhatsApp 7730047770 Call 7730017778

Address: #504, S.G.M Mall, Above HDFC Bank, OPP Pillar NO. 14, Mehdipatnam , Hyderabad

'THE JOB EXPO INDIA PROVIDE Guidance to unemplyed indians & assistance to INDIA GOVERNMENT LICENCE HOLDERS.



## వ్యవసాయ కళాశాల విద్యార్థుల పీఆర్‌ఏ కార్యక్రమం

**నేటి సాక్షి, తొగుట(వడ్డే నరసింహులు):** సిద్ధిపేట జిల్లా బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రావెప్ (RAWE) శిక్షణ కార్యక్రమంలో భాగంగా కంగల్ గ్రామంలో పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (PRA) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి సంబంధించిన సామాజిక పటం (రాశీఎఖుశ్రీ మీఖజా), వెన్ డయాగ్రామ్, మ్యాట్రిక్స్ ర్యాంకింగ్, మొబిలిటీ మ్యాప్, పంటల విధానం మరియు పంటల రకాలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేపట్టారు. రైతుల నుంచి సమాచారం సేకరించి, గ్రామంలోని వ్యవసాయ పరిస్థితులు, వనరులు, సమస్యలు మరియు అవసరాలను గుర్తించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారి శ్రీ మోహన్ రావు గారు, థోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్త డా. సిహ్చా గారు. పల్లవి, కీటక శాస్త్ర విభాగానికి చెందిన డా. తబస్సుం, గ్రామ సర్పంచ్ శ్రీ సత్తయ్య, ఉప సర్పంచ్ శ్రీ మధారం ప్రశాంత్, ఆత్మ కమిటీ సభ్యుడు శ్రీ బ్రహ్మానందం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరిలో ముఖ్యంగా గ్రామంలోని 100 రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విద్యార్థులకు పూర్తి సమాచారం అందించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధికి ఉపయోగపడే విలువైన సమాచారం సేకరించబడిందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రాణం తీసిన సైకిల్ వ్యాయామం

‘చిన్నమెట్ పల్లి‘లో సైకిల్ పైనుంచి పడిపడి గాయాలు..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మూడు సంవత్సరాలుగా పెరాలసిస్‌తో బాధపడుతున్న రాంప్రసాద్‌కు దురదృష్టకర ముగింపు



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలం చిన్న మెట్ పల్లి గ్రామానికి చెందిన సిరిపురం రాంప్రసాద్ (47) ప్రమాదవశాత్తు సైకిల్ పై నుంచి కింద పడ్డారు. తలకు తీవ్రగాయమై చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. రాంప్రసాద్ గత మూడు సంవత్సరాలుగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి కారణంగా అతని కుడి చేయి సరిగా పనిచేయకపోవడంతో చికిత్స కోసం మసాజ్ సెంటర్‌కు వెళ్తుండేవాడు. ప్రతిరోజూ సైకిల్ నడిపితే ఆరోగ్యం మెరుగవుతుందని సూచించడంతో సుమారు 30 రోజుల క్రితం సైకిల్ కొనుగోలు చేసి గ్రామంలో నిత్యం వ్యాయామంగా నడుపుతున్నాడు. ఈ నెల 8న చిన్న మెట్ పల్లి గ్రామంలో సైకిల్ నడుపుతున్న సమయంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తల భాగంలో తీవ్ర గాయమైంది. గాయపడిన రాంప్రసాద్‌ను వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో 22న మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి మేనమామ అనుమల్ల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మిడిమిడి జ్ఞానంతో వైద్యం చేయడం వల్లే.. ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని గ్రామంలో ఆగ్రహం వ్యక్తం అవుతోంది.!

## పింఛన్ మంజూరు చేయాలి

బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళిమోహన్



**నేటి సాక్షి, పాములపాడు :** పాములపాడు గ్రామానికి చెందిన పూర్తి అంగవైకల్యం గల వికలాంగురాలు భూపతి లావణ్య కు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ రూ. 6 వేల నుంచి రూ. 15 వేల వరకు పెంచాలని ప్రభుత్వానికి బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ కోరారు. సోమవారం బీజేపీ “జనతా వారధి“ కార్యక్రమంలో భాగంగా పిజిఆర్ఎస్ లో ప్రజా సమస్యలను తహసిల్దార్, ఎంపీడీవో లకు తెలియజేస్తూ వినతి పత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు, జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు సూచనలతో సోమవారం “జనతా వారధి“ కార్యక్రమంలో భాగంగా వికలాంగుల సమస్యలపై తహసిల్దార్, ఎంపీడీవోకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. పాములపాడు గ్రామానికి చెందిన వికలాంగురాలు భూపతి లావణ్య కు 100 శాతం పూర్తి అంగవైకల్యం ఉందని రూ. 6వేలు నుంచి రూ 15 వేలు వరకు పెంచాలని, వికలాంగురాలు తల్లి అధికారులను కోరింది. నూతన ట్రైసైకిల్తో పాటు గృహం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- 35 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వైద్య బృందం

**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి(గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి మరియు కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ ముస్కు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన 90 మందికి కంటి పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో 35 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్లకు ఎంపికైన 35 మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు. ఆపరేషన్ చేయించుకునే వారితో పాటు, వారి వెంట వెళ్లే సహాయకులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం, భోజనం మరియు వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు కరుణాకర్ రెడ్డి వివరించారు.




ఎటువంటి ఖర్చు లేకుండా పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ నరహరి, క్లబ్ సభ్యులు తాదూరి సత్యనారాయణ, మహంకాళి చంద్రశేఖర్ ,సట్టా సురేష్, వైద్య బృందం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులు.. భారీ వర్షం

- కోరుట్ల నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేత
- మిర్చి, మామిడి పంటలకు నష్టం ఉ రైతుల్లో ఆందోళన






**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల నియోజకవర్గ పరిధిలో సోమవారం సాయంత్రం నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా పలు ప్రాంతాల్లో నిలిచిపోయింది. విద్యుత్ తీగలు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం వల్ల కొంత సమయం విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. దీంతో గ్రామాలు చీకట్లో మునిగిపోయాయి.

### ఈదురు గాలులతో రైతులకు తీరని నష్టం

చేతికి వచ్చిన ఎర్రమిర్చి పంటకు ఈ వర్షం తీవ్ర నష్టం మిగిల్చింది. పొలాల్లో ఎండబెట్టిన మిర్చి తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మామిడి పూత, చిన్న కాయలు గాలికి రాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షాలు పంటలపై ప్రతికూల ప్రభావం చూపడంతో అన్నదాతలు తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



# చిన్నారి హత్య నిందితులను వెంటనే ఉరితీయాలి

**నేటి సాక్షి, గజ్వేల్:** నాగర్ కర్నూల్ జిల్లా లో జరిగిన చిన్నారి హత్య ఘటనపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజ్ఞాపూర్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ప్రజ్ఞాపూర్ రజక సంఘం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రజక సంఘం బాధ్యులు మాట్లాడుతూ, అమాయక చిన్నారిపై జరిగిన ఈ దారుణ ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇలాంటి క్రూరమైన నేరాలకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, వేగవంతమైన విచారణ చేపట్టి కఠినాతికఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలుఉబాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు అమలు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి, అన్ని విధాలా అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాల అమలు, పోలీసు పర్యవేక్షణ బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రజక



సంఘం నాయకులు, టెంటు నర్సింలు, డ్రైవర్ రాములు, రాములు, చిట్టాపురం కనకయ్య, చిట్టపురం దుర్గయ్య, మెతుకు కర్ణాకర్, సాయిబాబా, ఉపేందర్, దశరథం,సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారికి నివాళులు అర్పించారు. “చిన్నారికి న్యాయం చేయాలి ఉ నిందితులకు కఠిన శిక్ష విధించాలి” అంటూ నినాదాలు చేశారు.

# మస్కట్ నుంచి బొమ్మెనకు చేరుకున్న మృతదేహం

- ఉపాధి కోసం వెళ్లిన యువకుడి మృతి

**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన లోలపు శ్రీనివాస్ (40) మస్కట్ దేశంలో మృతి చెందగా, సోమవారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఉపాధి నిమిత్తం మూడు నెలల క్రితం మస్కట్ వెళ్లిన శ్రీనివాస్ అక్కడ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 19న కన్నుమూశారు. మస్కట్‌లో ఓ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో ఆయనకు అస్వస్థత కలగడంతో స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేందుకు వీసా తదితర ఖర్చుల కోసం చేసిన అప్పులు ఇంకా తీరక ముందే శ్రీనివాస్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహం గ్రామానికి చేరుకోగానే బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. శ్రీనివాస్ మృతితో బొమ్మెన గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





## బోయకొండ గంగమ్మకు భారీ ఆదాయం

45 రోజుల్లో రూ. 59.35 లక్షల నగదు

**నేటి సాక్షి, చౌడేపల్లి:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం దిగువపల్లి గ్రామంలో వెలసిన ప్రముఖ శక్తి క్షేత్రం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బోయకొండ గంగమ్మ దేవస్థానంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గత 45 రోజులకు గాను భక్తులు చెల్లించిన కానుకలను ఆలయ అధికారులు లెక్కించారు. ఇందులో రూ. 59,35,839 నగదు, 38 గ్రాముల బంగారం, 155 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీలు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. అన్నదానం హుండీలో రూ. 13,495 నగదు, రణభేరి గంగమ్మ దేవస్థానం రూ. 34,024 వచ్చాయి. ఈ హుండీ లెక్కింపును దేవస్థాన ఉప కమీషనరు, కార్యనిర్వహణాధికారి జె. ఏకాంబరం, చిత్తూరు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమీషనరు కె. చిట్టెమ్మ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి పోలీస్ సిబ్బంది, పుంగనూరు ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు, దేవస్థాన అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ ఆదాయం గణనీయంగా పెరగడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

- ఎంపిడిఓ కార్యాలయం నుండి బంజారా భవన్ వరకు భారీ ఉత్సవ ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సబ్ కలెక్టర్, స్కైలాబ్ నాయక్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** అల్ ఇండియా బంజారా సేవా సంఘం మిర్యాలగూడ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గిరిజన ఆరాధ్య దైవం "శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలు, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం నుండి మొదలై బంజారా భవన్ వరకు సేవాలాల్ మహారాజ్ స్వామి ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బంజారా భవన్ నందు గిరిజన సంప్రదాయ బద్ధంగా భోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజల, అనంతరం మినీ రవీంద్ర భారతి నందు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, గోర్ బంజారా సమాజానికి నిజమైన దైవం, ఆధ్యాత్మిక మార్గదర్శకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని, 18వ శతాబ్దంలోనే బంజారాల సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడేందుకు ఆయన ఎనలేని కృషి చేసారన్నారు. కర్ణాటకలో జన్మించిన సేవాలాల్ గారు, అహింస, శాకాహారం, ధర్మం, మరియు క్రమశిక్షణను పాటించాలని బోధించారు. మతమార్పిడులను, మూఢనమ్మకాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు, ఒక గొప్ప దార్శనికుడు. భవిష్యత్తులో వాహనాల వాడకం (ఎడ్లు లేని బండ్లు), నీటి ఎద్దడి గురించి ఆయన ఆనాడే చెప్పారు...అంత ముందు చూపు కలిగిన మహా జ్ఞానీ వారు అని అన్నారు. "సేవాలాల్ మహారాజ్ మనకు ఆత్మగౌరవాన్ని ప్రసాదించారు. ఆయన తండాల అభివృద్ధికి, విద్యకు, స్త్రీల గౌరవానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. "సేవాలాల్ మహారాజ్ చూపిన అహింసా మార్గంలో నడుస్తూ, బంజారా సమాజం విద్యావంతంగా, ఆరోగ్యంగా, ఐకమత్యంతో ముందడుగు వేయాలి. ఆయన ఆశయాలను సాధించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా మీ అందరికీ తెలియజేస్తున్నామని అన్నారు. నేను గిరిజన జాతికి చెందిన బిడ్డను కాకపోయినా, మిర్యాలగూడ గిరిజన సోదర సోదరిమణులు అందరూ నన్ను వారి సొంత కుటుంబ సభ్యుడిలా చూసుకుంటూ నాతో పాటు నడిచి నేటి వరకు, నన్ను ఈ శాసనసభ్యుడిగా మీ ముందు నిలబెట్టారని, వారి ఋణం నేను ఇప్పటికి మరచిపోను వారికి వారి కుటుంబాలకు, నా ఊపిరి ఉన్నంతవరకు అండగా ఉంటానాని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. మన గిరిజన నాయకుడు శంకర్ నాయక్ ఎమ్మెల్సీ తో పాటు, కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్మన్ పదవిని కూడా ఇచ్చి గిరిజనులను గౌరవించిందని, మీ ఆరాధ్య దైవం మాత్రమే కాదు నాకు కూడా ఆరాధ్య దైవం ఐనటువంటి సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు మీ అందరితో కలిసి జరుపుకుంటునందుకు నేను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అనంతరం గిరిజన నాయకులు, కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గం గిరిజన సంఘం నాయకులు, గిరిజన ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# మహిళా న్యాయవాదుల సదస్సుకు తరలిరండి

**ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు, గోడ పత్రికల ఆవిష్కరణ**

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహిళా న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిస్తూ సోమవారం కోరుట్ల కోర్టు ఆవరణలో కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సుకు అధిక సంఖ్యలో మహిళా న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్రిపల్లి గంగాధర్ కోరారు. న్యాయ నిష్ణాతులైన ప్రముఖులు భారత న్యాయ వ్యవస్థ, ప్రస్తుత ముఖ్య న్యాయ అంశాలు, మహిళా న్యాయవాదుల పాత్రపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు మహిళా న్యాయవాదులకు వృత్తి పరమైన మార్గదర్శకత్వం అందించే వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**మహిళా న్యాయవాదులకు దిశానిర్దేశం**

ఈ రాష్ట్ర స్థాయి సదస్సు ద్వారా మహిళా న్యాయవాదులు న్యాయ రంగంలో ఎదుర్కొనే సవాళ్లు, అవకాశాలు, చట్టపరమైన తాజా పరిణామాలపై స్పష్టమైన అవగాహన పొందుతారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా న్యాయవాదుల ఐక్యతకు ఈ సదస్సు దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సదస్సును విజయవంతం చేయడానికి కోరుట్ల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు

**న్యాయవాదుల సమక్షంలో ఆవిష్కరణ**

కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్రిపల్లి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచాల రామకృష్ణ, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొంపల్లి సురేష్ పాల్గొన్నారు.అలాగే కార్యవర్గ సభ్యులు కడకుంట్ల సదాశివరాజు, మహిళా న్యాయవాదులు మద్దుల రోజా, తోట లలిత, న్యాయవాదులు గాంధారి శ్రీనివాస్, చిలివేరి రాజశేఖర్, భీమానది రఘు, వోర్సు రాములు తదితరులు హాజరయ్యారు.

# రైతు సమస్యల పరిష్కారానికి బిజెపి కిసాన్ మోర్చా డిమాండ్

## ఎంఆర్‌ఓకు వినతిపత్రం

**డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన హెచ్చరిక**

**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** కథలాపూర్ మండలంలో రైతు సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఎంఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. రైతులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

**రైతు భరోసా విడుదల చేయాలి**

ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. వానాకాలంలో కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించిన బకాయిలను రైతులకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేసవి కాలంలో కూడా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు.





**వరద కాలువకు నీరు.. రుణమాఫీ అమలు చేయాలి**

వరద కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి సాగు అవసరాలు తీర్చాలని, రైతులకు పూర్తి స్థాయిలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు, మాజీ మండల అధ్యక్షులు కంటె సత్యనారాయణ, నరెడ్ల రవి, కథలాపూర్ మహేష్, కాసోజీ ప్రతాప్, పిడుగు ప్రతాప్, ఆరె శివ, బొమ్మ మధు, కంటె రాజం, లింగమూర్తి, సాయిరెడ్డి, అశోక్, కిషోర్, మహేష్, రాంసింగ్, ప్రవీణ్, శేఖర్, సురేష్, అనుదీప్, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించిన వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్

**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణం: ఆసిఫాబాద్ పట్టణంలోని 17వ వార్డులో వాటర్ మోటర్ చెడిపోవడంతో కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ తన స్వంత నిధులతో కొత్త వాటర్ మోటర్ ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో దాదాపు 100 కుటుంబాలకు మళ్లీ తాగునీటి సరఫరా పునరుద్ధరించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, 17వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించినందుకు కాలనీవాసులు వైస్ చైర్మన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నిసార్, సయ్యద్ జావిద్, షబ్బీర్, కాలనీవాసులు హఫీజ్, మాజిద్, ఫైజాన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# పసిపాపని సంపిన రెడ్లు



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి (గుండ ప్రశాంత్ గౌడ్):** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగే కుమ్మెర జాతరకు వెళ్లిన చాకలికులస్తుల పైన రెడ్ల కుల అహంకార దాడిలో మరణించిన రెండు నెలల పసి పాప బేబీ మౌనిక ఆత్మ శాంతికి కొవ్వొత్తులతో బీసీ ఎస్సి ఎస్టి జేఏసీ ఆధ్వర్యంలో గొల్లపల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మనాల కిషన్,రాష్ట్ర కమిటీ సభ్యుడు దువ్వాక శివ మహారాజ్, కొమరయ్య,రజక సంఘం అధ్యక్షులు కలకోట సత్యం, ఉపాధ్యక్షులు సాతల తిరుపతి,తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం నరసాపురం రవీందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గంగాధర నరేష్, శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ తిరుపతి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు కోమల జలంధర్,బోండ్ల నాగరాజ్, దేవరకొండ కరుణాకర్, సామాజిక సేవ కార్యకర్త గంగాధర మధుసూదన్, పొనగంటి రాజారత్నం, ప్రేమ్, సామాజిక సేవ కార్యకర్త శాతల్ల లక్ష్మణ్, బాలే అశోక్, తిరుపతి, జాను,ఒడ్నాల రాజేష్, మనుపాటి రమేష్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ గొల్లపెల్లి కమిటీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శిశువు మృతి ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి

**బిఎస్‌పి పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు వెన్నబోయిన రమేష్**




**నేటి సాక్షి, తిరుమలాయపాలెం(రుద్రరాజు):** నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మరి గ్రామం లో శిశువు మృతి ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి దోషులపై హత్య నేరం కింద కేసు నమోదు చేసి మృతి చెందిన పాప తల్లిదండ్రులకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కుటుంబ సభ్యులకు భద్రత కల్పించాలని బి ఎస్ పి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు వెన్నబోయిన రమేష్ డిమాండ్ చేశారు సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోఅంబేద్కర్ సెంటర్ వద్ద శిశువు మృతి ఘటనపై బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఎస్పీ పాలేర్ అసెంబ్లీ అధ్యక్షుడు ఎన్నేబోయిన రమేష్ నాయకత్వం వహించారు. ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం కారణంగా శిశువు ప్రాణం కోల్పోయిందని ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ నిరసనలో కుల, మత, పార్టీలకతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం బీఎస్పీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.